### శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్,నవంబర్7: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి (నవంబర్ 7) జనవరి వరకు 60 ప్రత్యేక రైళ్లను తిప్పనుంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి శబరిమల సమీప స్టేషన్ల వరకు నడుపుతుంది. శుక్రవారం నుంచి ఈ రైళ్లకు సంబంధించిన టికెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. చర్లపల్లి నుంచి కొల్లాం (రైలు నంబర్ 07107)- నవంబర్ 17, 24 తేదీల్లో, డిసెంబర్ 1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి బయల్దేరుతాయి. ఇవి మరుసటి రోజు కొల్లాం చేరుకుంటాయి. మొత్తం 10 రైళ్లను అందుబాటులో ఉంచారు. ఇవి పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతాయి. కొల్లాం నుంచి చర్లపల్లి (రైలు నంబర్ 07108)- నవంబర్ 19, 26 తేదీల్లో, డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లా నుంచి బయల్దేరుతాయి. మరుసటి రోజు చర్లపల్లి చేరుకుంటాయి. ఈ రైళ్లు రేణిగుంట, గూడూరు, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వస్తాయి.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :219 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 08-11-2025 | పేజీలు:4 వెల: 2.00

## రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టింది..



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యకపోతే పథకాలు ఆపేస్తామని అనడానికి రేవంత్ రెడ్డి అయ్య జాగీరా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇంట్లో నుంచి డబ్బులు ఇస్తున్నాడా లేదా ఆయన నాయన డబ్బులు ఇస్తున్నాడా అని మండిపడ్డారు. ప్రజల సొమ్ము ప్రజలకు ఇస్తున్నారని చెప్పారు. అది ప్రభుత్వం బాధ్యత అని, రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టింది.. అందుకే ప్రజలను భయపెడుతున్నాడని చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండేండ్ల కాంగ్రెస్ అరాచకపు పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మరో మూడేండ్లు రాష్ట్ర ప్రజలు నరకయాతన అనుభవించాలన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో వికాసం, రేవంత్ రెడ్డి రెండేండ్ల పాలనలో అంతా విధ్వంసమని విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని, వీధి దీపాలు లేవని, కాంగ్రెస్ గెలిచిన తర్వాత కంటోన్మెంట్ నియోజకవర్గం నాశనం అయిందని ధ్వజమెత్తారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిపిస్తే 6 వేల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని చెప్పారని, రూ.23 కోట్ల స్పోర్ట్స్ కాంప్లెక్స్ కట్టిస్తామని, డిఫెన్స్ భూములను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారని.. ఆ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఉన్నందుకే ముస్లింలు ఉన్నారని, తాము లేకుంటే ముస్లింలకు ఇజ్జత్ ఉండదని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ముస్లింలు స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎక్కడుందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించడం వల్లే నేడు కాంగ్రెస్ మంత్రులు గల్లీల్లో పరుగులు పెడుతున్నారని విమర్శించారు. పీజేఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి, ఆయన మరణానికి కారణం అయిందే కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి రేవంత్ రెడ్డికి ఎన్టీఆర్, పీజేఆర్ గుర్తుకువస్తున్నారని చెప్పారు. మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని సోయి వచ్చిందన్నారు. ఇవన్నీ కేవలం ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఒత్తిడి పెంచడం వల్లనే జరిగాయన్నారు.

## వందేమాతర గీతం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

న్యూఢిల్లీ, వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. దేశ ఐక్యత, దేశభక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఓ పోస్టు చేశారు. నవంబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7వ తేదీ వరకు వందే మాతరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వందేమాతర గేయం కేవలం పదాల అల్లిక కాదు అని, అది భారత దేశ అంతరాత్మను అందించిన స్వరమన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వందేమాతర గీతం దేశాన్ని ఐక్యంగా నిలిపిందన్నారు. స్వాతంత్ర్యోత్సవ జాగరణను బలోపేతం చేసిందన్నారు. మాతృదేశం కోసం అంకితమయ్యేలా, గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా ఆ గేయం విప్లవకారుల్ని ఆకట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదితో మన జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ గేయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి బలమైన స్వరంలో పూర్తి పాటను పాడాలని, భవిష్యత్తు తరాలకు



వందేమాతర గేయం ప్రేరణగా నిలుస్తుందని అమిత్ షా తెలిపారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ కంపోజ్ చేశారు. సాహిత్య జర్నల్ బంగదర్శన్‌లో నవంబర్ 7, 1875లో ఈ గేయం పబ్లిష్ అయ్యింది. ఆ తర్వాత 1882లో ప్రచురించిన ఆనందమట్ నవలలోనూ ఈ గేయాన్ని ఆయన పొందుపరిచారు. రబీంద్రనాథ్ ఠాకూర్ ఈ గేయానికి మ్యూజిక్ అందించారు.

## 14న నేను చెప్పిందే నిజమవుతుంది.. పోలింగ్‌పై ప్రశాంత్ కిషోర్ జోస్యం

పాట్నా:బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. నెలల తరబడి తాను చెబుతున్నదే నిజమైందని జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ అన్నారు. గురువారం తొలి విడత పోలింగ్ ముగిసింది. మొత్తం 64.66 శాతం పోలింగ్ నమోదైనట్లుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో 60 శాతం కంటే ఎక్కువ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని నెలల తరబడి తాను చెబుతూనే ఉన్నానని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలకు జన్ సురాజ్ పార్టీ ఒక ఎంపిక అయిందని.. ఈ విషయంలో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పోలింగ్ పెరగానికి ఛత్ పండుగ కూడా కలిసొచ్చిందని తెలిపారు. నవంబర్ 14న జన్ సురాజ్ పార్టీ చరిత్ర సృష్టించబోతుందన్న నమ్మకం తనకు ఉందని చెప్పారు. బీహార్‌లో తొలి విడత పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఊహించని రీతిలో ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలివచ్చారు. ఒక పండుగలా ఓటర్లంతా తరలివచ్చి ఓటు వేశారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు నమోదు కాని రికార్డ్‌ను నమోదు చేసింది. తొలి విడతలో అత్యధికంగా 64.66 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. 1951 తర్వాత ఇదే అత్యధిక పోలింగ్ శాతం అని పేర్కొంది. అంటే దాదాపు 74 సంవత్సరాల తర్వాత 2025లో అత్యధిక పోలింగ్ నమోదైనట్లుగా ఈసీ ప్రకటించింది. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. రెండు విడతలుగా పోలింగ్ జరుగుతోంది. తొలి విడతలో భాగంగా గురువారం 121 స్థానాలకు పోలింగ్ జరిగింది. రెండో విడతగా మంగళవారం 122 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. ప్రధానంగా ఇండియా కూటమి-ఎన్డీఏ కూటమి మధ్య పోటీ నెలకొంది. విపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్ ఉండగా.. అధికార కూటమి మాత్రం ముఖ్యమంత్రి అభ్యర్థి పేరు



ప్రకటించకుండగానే బరిలోకి దిగింది. ఇక ఇంటికో ప్రభుత్వం అంటూ ప్రతిపక్షం హామీ ఇవ్వగా.. అధికార కూటమి మాత్రం కోటి ఉద్యోగాలు ఇస్తామంటూ మేనిఫెస్టో ప్రకటించింది. ఇలా ఎవరికి వారే ప్రజలపై అనేక హామీలు కుమ్మరించాయి. మేనిఫెస్టో ప్రభావమో.. లేదంటే మార్పు కోసమో తెలియదు గానీ.. ఈసారి పోలింగ్ శాతం మాత్రం సరికొత్త చరిత్ర సృష్టించింది. ఓటర్లు తండోపతండాలుగా తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఆయా పార్టీలు విజయావకాశాలపై రకరకాలుగా ఊహాగానాలు చేసుకుంటున్నాయి. తొలి విడతలో మహిళలు రికార్డ్ స్థాయిలో పాల్గొని ఓట్లు వేశారని ఎన్నికల అధికారి వినోద్ గుంజ్యాల్ తెలిపారు. ఓటింగ్ సమయంలో వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. 1951-52లో జరిగిన మొదటి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర చరిత్రలో అత్యల్పంగా 42.6 శాతం పోలింగ్ నమోదైంది. ఇక 2000 సంవత్సరంలో 62.57 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2020లో 57.29 శాతం నమోదైంది. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆ రికార్డులన్నింటినీ బద్ధలు కొట్టింది. తొలి విడతలోనే 64.66 శాతం పోలింగ్ నమోదైంది.

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..



కాందహార్ ప్రావిన్స్, నవంబర్7, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే గురువారం సరిహద్దుల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ కాల్పులకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇరు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రావిన్స్‌కు చెందిన స్పిన్ బోల్డాక్ జిల్లా ఆసుపత్రి అధికారి ఈ వివరాలను వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ వైపు ప్రాణనష్టంపై తక్షణ సమాచారం అందుబాటులో లేదు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో పాకిస్థాన్‌తో మూడో విడత చర్చలు ప్రారంభమైన సమయంలోనే పాక్ దళాలు తమపై కాల్పులు జరిపాయని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ఆరోపించారు. "చర్చల బృందానికి గౌరవం ఇచ్చి, పౌర నష్టాన్ని నివారించేందుకు మా దళాలు సంయమనం పాటిస్తున్నాయి" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. "ఆఫ్ఘన్ వైపు నుంచి వచ్చిన ఆరోపణలను మేము తోసిపుచ్చుతున్నాం. ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి. మా భద్రతా దళాలు బాధ్యతాయుతంగా, పరిమితంగా స్పందించాయి" అని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాల్పులు సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు జరిగినట్లు స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, కాల్పుల విరమణ అమలులో ఉందని పాకిస్థాన్ ధ్రువీకరించింది. ఇరు దేశాల మధ్య ఘర్షణలను నివారించేందుకు టర్కీ వేదికగా శాంతి చర్చలు జరుగుతున్నాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోవడంలో గత వారం చర్చలు ప్రతిష్ఠంభనలో పడ్డాయి. పాకిస్థాన్‌లో దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద గ్రూపులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తోంది. గత అక్టోబర్‌లో జరిగిన ఘర్షణల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించగా, పాకిస్థాన్‌కు చెందిన 23 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో తాజా ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది.

## 1937లో వందేమాతరం గేయంలో కొన్ని చరణాలను తొలగించారు

న్యూఢిల్లీ: వందేమాతం జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకు చెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడి తమ మనోభావాలను ఆ గేయం ద్వార వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ




అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు. వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

## ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు



న్యూఢిల్లీ,నవంబర్7: అమెరికా- భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా? అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్?లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ - అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్-అమెరికా సంబంధాలపై సానుకూలం గా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు. అయితే రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లను తగ్గించుకుంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో స్పందించింది. తమ దేశం ఇంధన విధాన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం ఆధారం గా మాత్రమే ఉంటాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

### స్వాతంత్ర్య పోరాటంలో రణనినాదంగా వందేమాతరం

అమరావతి, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో యావత్ దేశాన్ని ఏకతాటిపై నడిపించిన 'వందేమాతరం' గేయం స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ చారిత్రక గేయం రచించి శుక్రవారంతో 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ దీనిని ఆలపించాలని ఆయన పిలుపునిచ్చారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం, కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య పోరాటంలో ఒక రణనినాదంలా పనిచేసిందని పవన్ కొనియాడారు. సమరయోధులకు మనోబలాన్ని, దేశ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని అందించిందని గుర్తుచేశారు.

## బీఆర్ఎస్ నేతల ఇళ్లల్లో సోదాలపై మంత్రి రియాక్షన్



హైదరాబాద్, నవంబర్ 7: జూబ్లీహిల్స్ ఉపఎన్నికల వేళ బీఆర్ఎస్ నేతల నివాసాల్లో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు కలకలం రేపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఇళ్లల్లో అధికారులు సోదాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతల నివాసాల్లో జరుగుతున్న సోదాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. శుక్రవారం మాట్లాడుతూ.. సోదాలు చేస్తున్న విషయమే తమకు తెలియదని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పోల్ మేనేజ్మెంట్ చేసి గెలుపొందారన్నారు. సెంటిమెంట్ మేనేజ్మెంట్ చేయడంలో బీఆర్ఎస్ నేతలకు అనుభవం ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్సే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ప్రజలు మద్దతు తెలుపుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కాగా..మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 6 గంటల నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. అయితే ఎలాంటి పత్రాలు చూపించకుండా అనధికారికంగా సోదాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసుల పహారా మధ్య తనిఖీలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తమను టార్గెట్ చేసుకుని సోదాలను నిర్వహిస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నారు.

### మర్రి జనార్దన్ ఫైర్...

అనధికారికంగా ఎలాంటి పత్రాలు చూపించకుండా తన ఇంట్లో సోదాలు చేస్తున్నారని మర్రి జనార్దన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఇంట్లోకి వెళ్లనివ్వడం లేదని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్ నేతలను ఎన్నికల అధికారులు టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల ందరినీ తమ ఇంటికి తీసుకువచ్చి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు డబ్బులు పంచుతున్నారంటూ ఫైర్ అయ్యారు.

సంపాదకీయం

శనివారం 08-11-2025

# 'తాత్కాలిక సంధి' కాలం!

ఎట్టకేలకు అమెరికా–చైనాల మధ్య తాత్కాలిక సంధి కుదిరింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు దక్షిణ కొరియాలోని బూసాన్‌లో గురు వారం చర్చించాక ఇరు దేశాల మధ్యా తాత్కాలిక సంధి కుదిరింది. వాణిజ్య కీచులాట లకు రెండు దేశాలూ ఏడాది పాటు విరామం ప్రకటించాయి. చైనా దిగుమతులపై విధించిన సుంకాల్లో 10 శాతం తగ్గించాలని అమెరికా నిర్ణయించింది. అలాగే అపురూప ఖనిజాల ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తేయాలని చైనా నిర్ణయం తీసుకుంది.దాంతోపాటు అమెరికా నుంచి సోయాబీన్స్ కొనుగోళ్లను పునరుద్ధరించటానికి అంగీకరించింది. రెండు దేశాల దోబూచులాట ట్రంప్ ఆగమనంతో మాత్రమే మొదలుకాలేదు. ఆ రెండింటి మధ్యా అంతకుముందే ఉన్న వాణిజ్య ఆధిపత్య పోటీ జో బైడెన్ హయాంలో తీవ్రతరమైంది. దాన్ని ట్రంప్ మరింత ఎగదోశారు. మొన్న ఏప్రిల్‌లో చైనాపై 145 శాతం సుంకాలు విధించారు. ఈ బ్లాక్‌మెయిల్‌కు తలొగ్గబోమనీ, తుదివరకూ పోరాడతామనీ చైనా జవాబిచ్చింది. ఈ పోటీ ఎలాంటి మలుపులు తిరుగుతుందో తెలియక ప్రపంచ దేశాలన్నీ సతమతమయ్యాయి. కానీ తాజా చర్చల వల్ల తాత్కాలికంగానైనా అవి సద్దు మణగటం మంచి పరిణామం. ఈ చర్చలు మరిన్ని చర్చలకు దారితీసి వాణిజ్య సంధికి దారితీయొచ్చన్న ఆశాభావం కూడా అందరిలో వ్యక్తమవుతోంది. ఇద్దరు దేశాధినేతలు కలుసుకున్నప్పుడు చిరునవ్వులు రువ్వుకోవడం, ఎక్కువసేపు కరచాలనాలతో ఫొటోలకు పోజులివ్వటం రివాజే. ట్రంప్, జిన్‌పింగ్‌లిద్దర్నీ అంచనా వేయటం అంత సులభం కూడా కాదు. అందులోనూ ట్రంప్ 24 గంటలు తిరగకుండా మాట మార్చటంలో సిద్ధహస్తుడు. అందువల్ల బూసాన్ సమావేశంపై పెద్దగా ఆశలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. పైగా చర్చల అనంతరం ట్రంప్ ప్రకటించినంతస్పష్టంగా చైనా వైపు నుంచి వివరణ లేదు. 'కీలక ఆర్థిక, వాణిజ్య అంశాలపై అధినేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరు దేశాల మధ్య దృఢమైన పునాది కోసం ట్రంప్‌తో కలిసి పనిచేయటానికి షి సంసిద్ధత చూపారు' అని చైనా ప్రకటన చెబుతోంది. అపురూప ఖనిజాల సంగతేమీ అందులో లేదు. కాకపోతే చైనా వాణిజ్య శాఖ ప్రకటన 'అక్టోబర్ 9 నాటి ఎగుమతుల నియంత్రణలను' తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తెలి పింది. అందులో అపురూప ఖనిజాలు కూడా ఉన్నాయి. కార్లు, సెమీ కండక్టర్లే కాక సైనిక ప్రయోజనాలకు వినియోగిస్తున్నట్టు తేలినందువల్లే నియంత్రణ విధించామని చైనా లోగడ తెలిపింది.ట్రంప్ తగ్గించామంటున్న సుంకాల విషయంలోనూ తకరారు ఉంది. మాదక ద్రవ్యాల తయారీకి తోడ్పడే ఫెంటానిల్ రసాయనాన్ని చైనా ఎగుమతి చేస్తోందని ఆరో పిస్తూ చైనా సరుకులపై ట్రంప్ 20 శాతం సుంకాలు విధించారు. ఇప్పుడు 10 శాతం తగ్గించటమంటే దాన్ని పూర్తిగా ఉపసంహరించుకోలేదని అర్థం. తాము కూడా సుంకాలు సవరిస్తామని చైనా అంటున్నది. తమ ఎన్‌విడియా కంపెనీ చిప్‌లను చైనా కొనుగోలు చేయొచ్చని ట్రంప్ అన్నప్పటికీ బ్లాక్‌వెల్ చిప్‌ల విషయం చర్చకు రాలేదంటున్నారు.అంటే ఈ సంధిలోనూ అపరిష్కృత సమస్యలు దాగున్నాయి.రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలూ అగ్రభాగాన ఉన్నాయన్న మాటేగానీ మాంద్యంతో యాతన పడుతున్నాయి. ట్రంప్ సుంకాల యుద్ధంతో సోయాబీన్స్‌ను బ్రెజిల్ నుంచి చైనా కొనుగోలు చేయటం మొదలెట్టింది. దాంతో అమెరికా రైతులు దివాలా స్థితికి చేరారు. అది ట్రంప్‌ను ఊపిరాడకుండా చేస్తోంది. అందుకే జిన్‌పింగ్‌తో చర్చల్లో తైవాన్ సమస్య జోలికి పోలేదు. అటు చైనా 2021 నాటి స్థిరాస్తి మార్కెట్ సంక్షోభం నుంచి బయటపడలేదు. దేశంలో కొనుగోలు శక్తి పడిపోవటంతో సరుకు అమ్ముడు కాక మార్కెట్లు నేలచూపు చూస్తున్నాయి. 2035 నాటికి ఏఐలో అగ్రగామిగా మారి తిరిగి పుంజుకోవాలనుకుంటున్నా అమెరికా నియంత్రణలు అడ్డంకిగా మారాయి. విద్య, నైపుణ్యాల్లో భారీగా వ్యయం చేయాలనుకుంటున్న చైనా అందుకవసరమైన పెట్టుబడుల కోసం చూస్తోంది. అపురూప ఖనిజాల నియంత్రణ ద్వారా ఇప్పటికైతే అమెరికాను దారికి తెచ్చుకుంది. వచ్చే ఏప్రిల్‌లో బీజింగ్ సందర్శిస్తానని ట్రంప్ అంటున్నారు గనుక ఆ లోగా ఈ 'తాత్కాలిక సంధి' సామరస్యానికి దారి తీస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

# సాంకేతికత ద్వారా ప్రజలకు సుపరిపాలన



అమరావతి,సాంకేతికత ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించాలని, గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చి సమర్థంగా వాడాలని సిఎం చంద్రబాబు అన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో పౌరుల డేటా పొందుపరిచామని, 42 విభాగాల్లో డేటా మొత్తం అందుబాటులోకి తెచ్చామని సిఎం చంద్రబాబు అన్నారు. డిజిలాకర్‌లో విద్యార్థుల అన్ని ధ్రువపత్రాలు, ప్రజల హెల్త్ రికార్డులు ఉండాల్సిందేనని అన్నారు. వైద్యుడి వద్దకు వెళితే డిజిలాకర్‌లో హెల్త్ రికార్డులు లభించాలి. వీలైనంత త్వరగా దస్త్రాలు పూర్తి చేస్తే ప్రభావవంతంగా ఉంటుంది. డేటా లేక్‌లో అన్ని విభాగాల డేటా తెలుసుకోవచ్చు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా టెక్నాలజీని వినియోగించాలి. రూల్ ప్రకారం లేకపోవడం వల్ల 60–70 శాతం పనులు లిటిగేషన్లలోఉంటున్నాయి. ఏఐని వాడితో జీవోల ద్వారా లిటిగేషన్లు రాకుండా నివారించవచ్చన్నారు. శాఖలవారీగా లక్ష్యాలు, సాధించిన అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రులు, ఉన్నాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయం లో డేటా–డ్రివెన్ గవర్నెన్స్ – పాలనలో టెక్నాలజీ – ఆర్టీజీఎస్‌తో సమన్వయంపై మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాఖల వారీగా ఎవరు, ఎన్ని దస్త్రాలు ఎన్ని రోజుల్లో క్లియర్ చేస్తున్నారో తెలపాలన్నారు. ఇటీవల తుపానులో సాంకేతికతతో ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించగలిగాం. డేటా ఆధారిత పాలన అత్యంత కీలకమైన అంశంగా మారింది. దీర్ఘ, మధ్య, స్వల్పికాలిక లక్ష్యాల మేరకు ప్రణాళికలు రూపొందించాలి. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలు రూపొందించాం. 2017 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల మేరకు అందరూ పనిచేయాలి. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి విజన్ ఎ÷–లాన్‌ను అమలు చేస్తాం. ప్రతి నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందని సీఎం చంద్రబాబు చెప్పారు. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని అన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే లక్ష్యం కావాలని సూచించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని అధికారులకు తెలిపారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫానును టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగామని సీఎం అన్నారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామన్నారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని చెప్పుకొచ్చారు. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. సీఎఫ్‌ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం తెలిపారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నామని అన్నారు. నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతీ నియోజకవర్గానికి ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి విజన్ ఎలాన్ అమలు చేస్తామన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నామని.. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోందని.. సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామని సీఎం తెలిపారు. అంగన్‌వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలని అధికారులకు సూచించారు. అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం ఒక్క చోటే క్రోడీకరించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ డేటా ద్వారా రియల్ టైమ్‌లోనే అనలటిక్స్ చేసి వాటి ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉందని చెప్పుకొచ్చారు. ప్రిడిక్టివ్ అనలటిక్స్‌కు కూడా టెక్నాలజీ ద్వారా సాధ్యం అవుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం, పాలన కోసం భారీస్థాయిలో బ్జడెట్ వ్యయం చేస్తున్నామని.. నిధులు వ్యయం సమర్థంగా జరగాలని సూచనలు చేశారు. ప్రస్తుతం ఇ్గ÷ల్స్ కూడా అందరికీ అందుబాటులో ఉన్నాయని.. ఎంత వేగంగా నిర్ణయం తీసుకుంటున్నారన్నదే ప్రశ్న అని అన్నారు. గతంలో ఒక్క చదువుకే కులం, స్థానికత, ఆదాయం ఇలా వేర్వేరు ధృవపత్రాలు 10 రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఈ పరిస్థితి అంతా మారిపోవాలని... కేంద్రం తీసుకొచ్చిన డీజీ లాకర్‌ను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. అందరూ అన్ని శాఖలలోని సమాచారాన్ని తెలుసుకుని దానిని గుర్తించి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాల వల్ల చాలా ప్రాణాలు పోయాయని అన్నారు. శ్రీకాకుళంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటి ప్రమాదం జరిగిందని.. ఒక సంఘటన తర్వాత ఆయా తప్పులు దిద్దుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్ఓపీ ఉన్నా దానిని ఎందుకు పాటించలేక పోతున్నాని ప్రశ్నించారు. పీపుల్స్ పాజిటివ్ పర్సెప్షన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. వాటన్నింటినీ సరిచేస్తుంటే మళ్లీ ప్రభుత్వంపైనే బ్లేమ్ గేమ్ వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యన్నారు. పారదర్శకత పాటించటంతో పాటు దానిని ప్రజలకు కూడా సరిగ్గా చెప్పుకోవాలని తెలిపారు. పోలీసు విభాగానికి సంబంధించిన వివరాలు కూడా డేటా లేక్‌కు అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పాల్గొనగా... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## డ్రగ్స్ ఓవర్ డోస్‌తో వ్యక్తి మృతి

హైదరాబాద్, డ్రగ్స్ భూతం యువతను పట్టిపీడిస్తోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న అనేక మంది డ్రగ్స్ భూతానికి బలైపోతున్నారు. తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో తరచుగా డ్రగ్స్ పట్టుబడటం కూడా తీవ్ర కలకలం రేపుతోంది.

# అమెరికాలో ట్రంప్ వ్యతిరేక పవనాలు !

వాషింగ్టన్,ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక ఏడాదిలోనే వపరీతమైన వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. తమ దేశంలోనే గాకుండా ప్రపంచం యావత్తు ఇప్పుడు ట్రంప్ తీరుపై మండిపడుతోంది. పెద్దన్న పాత్రలో ప్రపంచానికి మేలు చేయడం, దేశీయంగా ఆదరణ పొందడంలో ట్రంప్ విఫలమ్యారు. అంతేకాదు ప్రతి ఒక్కరూ ట్రంప్ దిగిపోవాలనే కోరుకుంటున్నారు. ముఖ్యంగా స్థానికంగా అమెరికా ప్రజలు కూడా ట్రంప్ తీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అందుకు తాజాగా జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ప్రపంచాన్ని పలు రకాలుగా బెదిరిస్తూ, వీరంగాలు వేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు జోహ్రాన్ మమ్దానీ విజయం నైతికంగా పెద్ద ఎదురుదెబ్బ. అంతేగాకుండా రాజకీయంగా ఘాటైన హెచ్చరికగా కూడా చూడాలి. జాత్యహంకార హుంకరింపులను, వర్ణ వివక్షలను అధిగమించి ఆసియా, ఆఫ్రికా సంతతికి చెందిన అమెరికా పౌరులు ప్రతిష్ఠాత్మక స్థానిక ఎన్నికల్లో ఓటర్ల హృదయాలను చూరగొనడం అపూర్వమే గాకుండా, అద్వితీయంగానూ గుర్తించాలి. న్యూయార్క్, వర్జీనియా, న్యూజెర్సీల్లో డెమాక్రట్లు గెలవడం ట్రంప్ చాపకింద నీరు చేరించదనే చెప్పలి. వివిధ కీలక పదవులను గెలుచుకొని వీరుచరిత్రను సృష్టించడం కన్నా ట్రంప్‌కు సవాల్ విసిరారని చెప్పాలి. న్యూయార్క్ మహానగర మేయర్ పదవికి హోరాహోరీగా జరిగిన పోరులో జోహ్రాన్ మమ్దానీ అద్వితీయ విజయం సాధించారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి గజాలా హష్మీ ఎన్నికయ్యారు. సిన్ సినాటీ మేయర్ పదవికి ఆఫ్తాబ్ పురేవాల్ రెండోసారి ఎన్నికై రికార్డు సాధించారు. అందులోనూ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి తమ్ముడు కోరీ బౌమాన్‌ను ఆయన చిత్తుగా ఓడించడం మరో విశేషం. వీరందరూ డెమొక్రాట్ అభ్యర్థులు కావడం ఇంకో విశేషం. అమెరికా స్థానిక ఎన్నికల్లో డెమాక్రట్ల విజయం ట్రంప్ పాలనాతీరుపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహానికి నిదర్శనగంఆ చూడాలి. ఈ విజయ పరంపరలో న్యూయార్క్ ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ మహా నగరాల్లో అగ్రస్థానంలో నిలిచే న్యూయార్క్ మేయర్ పదవిని పిన్నవయస్కుడైన మమ్దానీ చేజిక్కించుకోవడం ఓ చరిత్ర అయితే..అతను ట్రంప్‌కు సవాల్ విసరడం మరో చరిత్రగా గుర్తించాలి. దేశాధ్యక్షుడయిన ట్రంప్ వ్యతిరేక ప్రచారం చేసినా అతడు ధిక్కరించి నిలిచాడు. మాజీ గవర్నర్ ఆండ్రూ కూమో, రిపబ్లికన్ కర్టిస్ స్లీవాలను మట్టి కరిపించారు. బహుళజాతులతో కూడిన సుమారు 90 లక్షల జనాభా, 254 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో కూడిన న్యూయార్క్ నగర మేయర్ పదవి అమెరికా రాజకీయాల్లో కీలక స్థానం ఆక్రమిస్తుంది. ఆ నగర మేయర్లు దేశ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉంటారు. అలాంటి కీలక పదవిని దక్కించుకునేందుకు మమ్దానీ విలక్షణ పోరాటాన్ని వీరోచితంగా నడిపారు. డెమొక్రాటిక్ సోషలిజం తన సిద్దాతం అని బాహాటంగా చాటుకున్న మమ్దానీ దేశానికి కుబేరులు అవసరం లేదని ఢంకా బజాయించి మరీ చెప్పడం విశేషం. దాంతో సంపన్నులు వందల వేల కోట్ల డబ్బు గుమ్మరించి అతడిని ఓడించాలని చూశారు. కొందరు కార్పొరేట్లు నామమాత్రంగా మద్దతు తెలిపినా ఎన్నికల నిధులు మాత్రం విదల్చకపోవడం గమనార్హం. పేదల కొద్దిపాటి చందాలతో పోటీచేసి పెద్దలకు చుక్కలు చూపించారు మమ్దానీ. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ వంటి జాతీయవాద నినాదాలతో రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లో మమ్దానీని ఓడించేందుకు గట్టిగా కృషిచేశారు. వివక్షాపూరిత ప్రచారాన్ని మమ్దానీ ప్రజా సంక్షేమ నినాదాలతో ఢీకొట్టారు. అమెరికా గొప్పదేశం కావాలంటే సామాన్యుల సమస్యలు నెరవేరడం తక్షణ అవసరమని సంక్షేమ హామీలతో సవాల్ విసిరారు. అణ్వస్త్రాల కన్నా ప్రజలకు అన్నవస్త్రాలు ముఖ్యమని చాటిచెప్పారు. కూడూ, గూడూ, గుడ్డా కావాలని దేశ నాయకత్వానికి గడ్డిపెట్టారు. శుష్క జాతీయవాద నినాదాలను ప్రజావాణితో ఎదుర్కొన్నారు. సంపన్న అమెరికాకు మరోసారి పేదల బాగోగులను గుర్తుచేసి గుణపాఠం చెప్పారు. ట్రంప్ విధానాలకు ఈ విజయ పరంపర చెంపపెట్టు లాంటిది. రిపబ్లికన్ ఉడుం పట్టులో బిగుసుకుపోయిన అమెరికాలో మారుతున్న ఆలోచనా ధోరణికి ఈ విజయాలు అద్దం పట్టాయి. ముఖ్యంగా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాలపై నిరసనగా కూడా ఈ విజయాలను చూడాల్సి ఉంటుంది. ట్రంప్ రెండోసారి అధజకారం చేపట్టాక జరిగిన ఈ అతిపెద్ద ఎన్నికల ఫలితాలు డెమెక్రాట్లకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. న్యూయార్క్‌ను మమ్దానీ గెలుచుకోవడంతో పాటు, న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్లుగా డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే గెలవడం విశేషం. ట్రంప్ పార్టీ, ఆయన బృందం, మతవాదులూ మితవాదులు కలసికట్టుగా ముస్లిం వ్యతిరేకతను ఎంతగా రేపినప్పటికీ మమ్దానీ, హష్మీల విజయం ఆపలేకపోయారు. డెమోక్రాటిక్ పార్టీ తరఫున నగర మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండుమందిని వెనక్కునెట్టి మమ్దానీ ఎన్నికకావడం మిగతా ప్రపంచాన్ని ఆకర్షించింది, ట్రంప్‌ను భయపెట్టింది. అతని విజయం ఖాయమని అర్థం అవుతున్నకొద్దీ ట్రంప్ దాడిహెచ్చింది, దూకుడు పెరిగింది. ఓటర్లకు మమ్దానీ మత, సైద్ధాంతిక మూలాలను ట్రంప్ పదేపదే గుర్తుచేస్తూ, ఈ కమ్యూనిస్టు ఏలుబడిలో నగరం నాశనమైపోతుందని హెచ్చరించారు. వెయ్యేళ్ళ విఫలకమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకితెచ్చి ఆర్థికంగా, సామాజికంగా నగరాన్ని భ్రష్టు పట్టిస్తాడన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే నిధులివ్వకుండా నగరాన్ని నిలువునా మాడ్చేస్తానని కూడా పౌరులను ట్రంప్ బెదిరించారు. మమ్దానీ కనుక గెలిస్తే తమ పెట్టుబడిదారీ సమాజం మీద ఆ ప్రభావం అధికంగా ఉంటుందని ట్రంప్ భయం. పునాదిలోనే దానిని చిదిమేయడానికి తన పార్టీని ఈ ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా, డెమోక్రాటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆండ్రూ కుమోకు మద్దతు ప్రకటించారు. డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తును నిర్ణయించేది దాని నాయకత్వం కాదు, కార్మికవర్గమేనని బెర్నీశాండర్స్ మరోమారు గుర్తుచేస్తున్నారు. తన విజయాన్ని కారు చీకటిలో కాంతిరేఖగా మమ్దానీ అభివర్ణించడం సముచితం. రెండుపార్టీల మధ్యా పెద్ద తేడాలేకుండా ఘనీభవించిపోయిన అమెరికాలో సామాన్యుల సంక్షేమానికీ, శ్రేయస్సుకూ హామీపడుతున్న ఎజెండాతో కొత్త రాజకీయానికి మమ్దానీ తెరదీశారని చెప్పవచ్చు. వలసదారులను తరిమేస్తున్న రాజ్యంలో ఓ వలసదారుల సంతానం విజయం సాధించి ట్రంప్‌కు సవాల్ విసరడం సామాన్య విషయం కాదు.



# జూబ్లీహిల్స్‌లో ఎవరి ధీమా వారిది

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం హోరాహోరీ పోరు సాగుతోంది. అతిరథ మహారథులంతా ప్రచారంలో దిగారు. కాంగ్రెస్ తరఫున సిఎం రేవంత్, మంత్రులు గల్లీగల్లీ ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌ల్తో సవాళ్లు విసురుతున్నారు. బిఆర్ఎస్ తరఫున కెటిఆర్ ముందు వరసలో ఉన్నారు. అనేకమంది బిఆర్ఎస్ నేతలు ఉన్నా ఆయనే ముందుండి నడుపుతున్నారు. ఇక బిజెపి నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎవరికి వారు విమర్శలు, ప్రతి విమర్శలతో ఈ ఉప ఎన్నిక వేడెక్కింది. గెలిస్తే కాంగ్రెస్‌కు పరువు ఉంటుంది. తమ పథకాలకు ప్రజలు ఆమోదిస్తున్నారని, పాలనను మెచ్చుకుంటున్నారని చెప్పుకోవచ్చు. బిఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసే అవకాశం మరింత పెరుగుతుంది. ఎంతమంది వచ్చినా ప్రజలు తమ వెన్నంటే ఉన్నారని చెప్పుకోవచ్చు. ఇక బిజెపి గెలిస్తే నరేంద్రమోడీ ఛరిష్మా అని ప్రచారం చేసుకుంటారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అంటారు. ఎన్నికల తరవాత ఇవే ప్రకటనలు కొంచెం అటుఇటుగా ఉంటాయి. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఓటరు మహాశయుడు మరిచిపోలేదు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన దురాగాతాలను కూడా గమనిస్తూనే ఉన్నాడు. ఇక, సమయం వచ్చింది. రేవంత్ బుల్డోజర్ పాలనకు తమ సిరా చుక్కతో బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లను బిఆర్ఎస్ కోరుతోంది. మరో నాలుగు రోజుల్లో జరుగనున్న ఉప ఎన్నికలో హస్తం పార్టీ 30వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తుందని సిఎం రేవంత్ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలా పిలిచే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. దురదృష్టవశాత్తు ఆయన అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తి రేకెత్తిస్తున్నది. ఇక మైనార్టీలు ఎక్కువగా ఉన్న జూబ్లీహిల్స్‌లో ఆ వర్గం ఓటర్లను ఆకట్టుకోవడానికి అజారుద్దీన్‌కుఅ త్యవసరంగా మంత్రి పదవి కట్టబెట్టారు. దీంతో వారి మద్దతు కొంత కాంగ్రెస్ సాధించిందనే చెప్పాలి. ఎంఐఎం కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం కలసివచ్చే అంశం. ఓటర్లు ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఓటేసే అవకాశాలు ఉన్నాయని బిజెపి, బిఆర్ఎస్ ఆశగా ఉన్నాయి. ఇదే సందర్భంలో బిఆర్ఎస్ సొంత సర్వేలతో హడలెత్తించే ప్రయత్నంలో ఉంది. ప్రతి సర్వేలోనూ కారు దూసుకుపోయినట్టు ఉందని చెబుతోంది. . జూబ్లీహిల్స్ ఓటర్లలో 48 శాతం మంది కేసీఆర్ పార్టీకి మద్దతు ప్రకటించగా.. కాంగ్రెస్‌కు 42శాతం, బీజేపీకి 9శాతం మంది ఓటేస్తారని ముందే చెప్పుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురనున్నట్టు సర్వే తేల్చిందని ప్రచారం చేసుకుంటున్నారు. రేవంత్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా?, కేసీఆర్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఇక్కడ ఉత్పన్నం కానేకాదు. ఎందుకంటే ఇక్కడ ప్రభుత్వ అజమాయి షీయే ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే ఉప ఎన్నికల్లో అనుకూలత ఉంటుంది. కాబట్టి కొంత అటుఇటుగా మాత్రమే మెజార్టీ ఉన్నా గెలుపు అవకాశాలు ఎక్కువగా అధికార పార్టీకి ఉంటుంది. ఇకపోతే ఇక్కడ ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఇది ప్రజలకు కూడా బాగా తెలుసు.

# బండి బోరబండ ప్రచారానికి అనుమతి నిరాకరణ

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటింగ్ గురువారం సాయంత్రం కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి. కాంగ్రెస్ తమపై కుట్రలు చేస్తోందని, కనీసం ప్రచారం చేసుకోనివ్వకుండా ఇలా పర్మిషన్ కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే తమ సభకు అనుమతి ఇచ్చి రద్దు చేయడమేంటని బీజేపీ ఎన్నికల ఇంఛార్జ్ ధర్మారావు ప్రశ్నించారు. కచ్చితంగా సాయంత్రం బోరబండలోనే మీటింగ్ జరిపి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ శ్రేణులంతా భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. బండి సంజయ్ సభకు ఆటంకాలు లేకుండా సహకరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వెల్లడించారు.

# పరామర్శించే తీరిక లేదా?

హైదరాబాద్,కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వెళ్లే ఘాట్ రోడ్డు లో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు లోయలో పడి 65 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తరువాత అప్పటి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు బాధితులను పరామర్శించలేదని బీజేపీ మొదలు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. సోమవారం నాడు చేవెళ్ల లో జరిగిన బస్సు–టిప్పర్ యాక్సిడెంట్ లో 19 మంది ప్రయాణీకులు ప్రాణాలు విడిచారు. ప్రమాద ఘటన జరిగిన రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శిస్తారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆశించారు. మరునాడు అయినా రేవంత్ రెడ్డి బాధిత కుటుంబాలను ఓదార్చుతారని, రోడ్డు విస్తరణ పనులపై ప్రకటన చేస్తారని ఎదురు చూసి నిరాశపడ్డారు.జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం ఘాట్ రోడ్డులో 2018 సెప్టెంబర్ 11వ తేదీన ఘోర బస్సు ప్రమాదం జరిగింది. దేవాలయం నుంచి ఘాట్ రోడ్డులో కిందికి వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలో పడింది. బస్సులో 108 మంది ప్రయాణీకులు ఉండగా, 65 మంది చనిపోయారు. దేశ చరిత్రలోనే బస్సు ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది. సిద్ధిపేట జిల్లా దుబ్బాకలో 2018 నవంబర్ లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ, 65 మంది చనిపోతే పరామర్శించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సమయం లేదని విమర్శించారు. అక్కడెక్కడో పంజాబ్ లో రైతులు చనిపోతే చెక్కులు ఇస్తున్నారు, కొండగట్టులో భక్తులు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదని అప్పటి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు.పేదోళ్ల ఉసురు ఊరికే పోదని ఆయన దుమ్మెత్తిపోశారు. బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకుంటే కేసీఆర్ కు పాలాభిషేకం చేస్తానన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదం తరువాత అప్పటి మంత్రి టీ.హరీశ్ రావు ఎందుకు నోరు మెదపలేదని మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఇటీవలే ప్రశ్నించారు. కేసీఆర్ కూడా ప్రమాదం జరిగిన ఘాట్ రోడ్డు వద్దకు ఎందుకు వెళ్లలేదని ఆయన నిలదీశారు. బస్సు ప్రమాదంలో మరణించిన 65 మంది కుటుంబాల సభ్యులను పరామర్శించేందుకు కేసీఆర్ ఎందుకు వెళ్లలేదని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ప్రశ్నించారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంతటి విషాద ఘటనపై కేసీఆర్ స్పందించకపోగా ఇతర రాష్ట్రాలలో రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్నారనే

# చీమల ఫోబియాతో మహిళ ఆత్మహత్య

సంగారెడ్డి,అనేక మంది అనేక రకాల వ్యాధులతో, మానసిక ఇబ్బందులతో చనిపోతుంటారు. ఆరోగ్యం బాగాలేక, లైఫ్ ఫెయిల్యూర్ కావడం, డిప్రెషన్, లోన్ల ఒత్తిడి వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా తాజాగా జరిగిన ఓ ఘటన తీవ్రంగా కలిచివేస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు, ఫైనాన్షియల్ సమస్యలు, లైఫ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకపోయినా ఆమె చనిపోయింది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఒక్కసారిగా షాక్ కు గురి చేస్తోంది. ఇలా కూడా చనిపోతారా? వామ్మో అంటూ ఈ విషయం తెలుసుకున్నవారు ఆశ్చర్యానికి గురవుతున్నారు. సంగారెడ్డిలో జరిగిన ఈ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది.ఓ మహిళ అనూహ్యంగా మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. చీమల ఫోబియాతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్ పూర్ మున్సిపాలిటీలోని శర్వా హోమ్స్ లో మనీషా ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. చీమల ఫోబియాతో తాను చనిపోతున్నానని, తన కూతురు జాగ్రత్త అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చీమల ఫోబియాతో మహిళా చనిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహిణి మరణించడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

# ఓట్చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విజయవాడ,బీజేపీ దొంగ ఓట్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ఇప్పటికే సంతకాల సేకరణ చేపట్టింది. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను హస్తం నేతలు ట్రక్కుల్లో ఢిల్లీకి పంపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి ట్రక్కును జెండా ఊపి ప్రారంభించారు. ఓట్ చోర్.. గద్దీ చోర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. దొంగ ఓట్లకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ మొదలు పెట్టామని, సంతకాలను రామ్ లీలా మైదానానికి తెస్తామన్నారు. అక్కడ నుంచి రాష్ట్రపతికి అందజేయనున్నట్లు వైఎస్ షర్మిల రెడ్డి పేర్కొన్నారు.రాహుల్ గాంధీ బుధవారం హైడ్రోజన్ బాంబ్ పేల్చారని.. దొంగ ఓట్లపై ఒక్కొక్కటిగా రాహుల్ గాంధీ బయటకు తీస్తున్నారని తెలిపారు. హర్యానాలో రెండు కోట్ల ఓట్లు ఉంటే.. 25 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని.. ఎనిమిది మందికి ఒక దొంగ ఓటు చేర్చారని అన్నారు. లక్షా 18 వేల ఓట్ల తేడాతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని షర్మిల అన్నారు. అయితే 25 లక్షల దొంగ ఓట్లు చేర్చారు కాబట్టే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అంటే దొంగ ఓట్లు లేకుంటే బీజేపీకి అధికారంలేదన్నారు. హర్యానాలో కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కట్టారని తేలిందని షర్మిల తెలిపారు. సర్వేలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఇచ్చాయని గుర్తుచేశారు. అయినా బీజేపీ ఎలా గెలిచిందో ఇప్పుడు రాహుల్ గాంధీ బయట పెట్టారన్నారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీకి ఆర్ఎస్ఎస్‌గా పని చేస్తోందని ఆరోపించారు. బీజేపీ అన్ని వ్యవస్థలను ఇప్పటికే భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా భ్రష్టు పట్టేలా చేసిందని మండిపడ్డారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేశారని విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపాడటానికి పోరాటం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఆయన పోరాటం చేస్తున్నారని అన్నారు. ఓటర్ల జాబితా డిజిటర్ రూపంలో ఇవ్వాలని కోరినా స్పందన లేదన్నారు. కాంగ్రెస్‌కు బలం ఉన్న ప్రాంతాల్లో దొంగ ఓట్లు ఎక్కించారని ఆరోపించారు. ఇలా అనేక రాష్ట్రాల్లో దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యలు చేశారు.

# ఎమ్మెల్యేకు ఎంత కష్టమొచ్చే..!

హైదరాబాద్, ఒకప్పుడు ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే. బీఆర్ఎస్ హయాంలో ఆ నియోజకవర్గంలో ఆయన హవానే వేరు. ఆయన ఎంత చెప్తే అంత అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడింది. తాను గెలిచినా తన పవర్ తగ్గినట్లు అర్థమైంది. దీంతో ఆ ఎమ్మెల్యే కారు దిగి హస్తం గూటికి చేరిపోయారు. అయితే తాను అనుకున్నది ఒక్కటి ..అయిందొక్కటి అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అటు కాంగ్రెస్ నేతలు పిలవరు. ఇటు బీఆర్ఎస్ నేతలతో కలిసి పనిచేయలేరు. చివరకు తన నియోజకవర్గానికి మంత్రులు వచ్చినా ఎమ్మెల్యేకు ఇన్విటేషన్ ఉండట్లేదట. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయన కష్టాలకు కారణాలేంటి?

కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్..

పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రొటోకాల్ రగడ నడుస్తోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆయన ఆగ్రహంతో ఉన్నారట. అధికారిక కార్యక్రమమైనా..కాంగ్రెస్ పార్టీ ప్రోగ్రామ్ అయినా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని పట్టించుకునే వాళ్లే లేరట. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కారు దిగి హస్తం గూటికి చేరారు. అయితే గూడెం చేరికపై పటాన్ చెరు లోకల్ లీడర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముందు నుంచి తమ నిరసన గళం వినిపిస్తున్నారు. అటు ఓటమి చెందిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుతోనూ బీఆర్ఎస్ లో ఉన్నప్పటి నుండే విబేధాలున్నాయి. దీంతో నియోజకవర్గంలో కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్ అన్నట్లుగా ఎమ్మెల్యే వర్గం, లోకల్ లీడర్లు చీలిపోయి రోడ్డెక్కి రచ్చ చేశారు. ఆ పంచాయితీ పార్టీ క్రమశిక్షణా కమిటీకి కూడా చేరింది. ఔట్ పుట్ ఏంటో ఇంకా తెలియదు కానీ.. పటాన్ చెరు కాంగ్రెస్ రచ్చ నడుస్తూనే ఉంది.అయితే స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారట. ఇటీవల కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్లతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి వీఎస్టీ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకు వచ్చింది. ఈ విషయంపై అధికారులు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదట. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులపై సమావేశాలు పెట్టారట. కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ ఎండీ గౌతమ్ కొల్లూరులో పర్యటించి ఈ పనులకు మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని పెట్టుకున్నారు. ఆ సమయంలో కూడా అధికారులు ఎమ్మెల్యే గూడెంకు కనీస సమాచారం అందించలేదట.

ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేకి నో ఇన్విటేషన్..

ఇక ప్రారంభోత్సవానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ వస్తున్నారంటూ అధికారులు ప్రకటించి ఆహ్వాన పత్రికలు పంచేశారు. ఇక చివరి క్షణంలో డీఈవో వెంకటేశ్వర్లు ద్వారా తనకు సమాచారం అందించారని ఎమ్మెల్యే గూడెం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారట ఎమ్మెల్యే.

# వాట్సాప్‌లో కోర్టు ఉత్తర్వు.. బయటపడిన మరో డిజిటల్ మోసం!

హైదరాబాద్,'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు నేడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. నేరగాళ్లు పోలీసు, సీబీఐ, ఈడీ అధికారుల ముసుగులో డీప్‌ఫేక్ వీడియో కాల్స్, పోలీసు అధికారుల ముసుగులో ప్రజలను బెదిరించి నేరగాళ్లు డబ్బు దోచుకోవడమే కాక ప్రస్తుతం నకిలీ కోర్టు ఉత్తర్వులు సైతం సృష్టిస్తున్నారు. వీరి దాడులు కేవలం ఆర్థిక నష్టం కాకుండా, ప్రజా విశ్వాసంపై దాడిగా మారాయి. ఈ సమస్యను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించడం న్యాయవ్యవస్థ మేల్కొలుపునకు సంకేతం.రోజుకు వేలల్లో నమోదవుతున్న ఈ మోసాలు కేవలం వ్యక్తిగత విషాదాలు కావు. ప్రజల అజ్ఞానంతో పాటు అప్రమత్తత లోపాన్ని ఆసరాగా చేసుకుని మోసాలు చేస్తు న్నారు. ఈ సమస్య తీవ్రతను, గుర్తించిన సుప్రీంకోర్టు ఇటీ వల ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి, ప్రభావాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీ సులు జారీ చేయడమే న్యాయవ్యవస్థ మేల్కొలుపునకు ప్రతీక.

న్యాయమూర్తుల ఉత్తర్వులనే సృష్టించి..

చట్టం పట్ల పౌరులకు ఉన్న గౌరవాన్ని ఆయుధంగా మార్చుకొని నకిలీ ధ్రువపత్రాలు, నకిలీ కోర్టు ఉత్తర్వులతో పౌరుల జీవితకాల పొదుపును లూటీ చేయడం అత్యంత హేయమైన చర్య. హర్యానాలోని అంబాలాలో ఒక వృద్ధ దంపతులను నకిలీ సుప్రీంకోర్టు ఉత్తర్వులతో బెదిరించి రూ. 1.05 కోట్లు కాజేసిన ఉదంతంపై సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి. 'న్యాయమూర్తుల నకిలీ సంతకాలతో కూడిన ఉత్తర్వులను సృష్టించడం వ్యవస్థ గౌరవంపై ప్రత్యక్ష దాడిగా పరిగణించబడుతుంది' అని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేరాన్ని కేవలం 'సాధారణ మోసం'గా చూడలేమని, ఇది న్యాయ వ్యవస్థ పునాదులనే కదిలించి, ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే తీవ్రమైన వ్యవస్థాగత వైఫల్యానికి సంకేతంగా పరిగణించాలి.

ఇది అంతర్జాతీయ సమస్య..

సమస్య పాన్-ఇండియా స్వభావం దృష్ట్యా, దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అప్పగించేందుకు సుప్రీంకోర్టు మొగ్గు చూపడం ఈ నేరాలకు ఉన్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను తెలియజేస్తుంది. ఈ నేరగాళ్లు కేవలం వాయిస్ ఓవర్లతో ఆపడం లేదు, వారు డీప్ ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి, న్యాయమూర్తులు లేదా పోలీసు అధికారుల ముఖాలను సృష్టించి, వీడియో కాల్స్‌లో నిజమైన నిర్బంధాన్ని సృష్టిస్తున్నారు. ఒకే ఏజెన్సీ ద్వారా దర్యాప్తు జరిపితేనే నేరాల వెనుక ఉన్న దేశవ్యాప్త, అంతర్జాతీయ ముఠాలను నిర్మూలించవచ్చు. ఈ ముఠాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల్లోని అక్రమ సైబర్ సెంటర్లు ఉన్నాయని అటార్నీ జనరల్ నివేదించారు. యువతను ఉద్యోగాల పేరుతో విదేశాలకు రప్పించి, వారి పాస్‌పోర్ట్‌లు లాక్కొని, వారిని 'సైబర్ బానిసలు'గా మార్చి ఈ నేరాలకు పాల్పడటం తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన. ఈ ముఠాల ఏకీకృత దాడిని ఎదుర్కోవాలంటే, దర్యాప్తు సంస్థల మధ్య పటిష్టమైన సమన్వయం దేశాల మధ్య తక్షణ అంతర్జాతీయ సహకారం తప్పనిసరి.

ఇది కేవలం డేటా ఉల్లంఘన కాదు..




దేశంలోని ప్రస్తుత చట్టాలకు ఈ తరహా అధునాతన మోసాలను ఎదుర్కొనే సామర్థ్యం ఏ మాత్రం లేదు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం- 2000, కొత్త భారతీయ న్యాయ సంహిత నిబంధనలు సాంప్రదాయ మోసం, ఫోర్జరీ అంశాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడ్డాయి. కానీ, నకిలీ కోర్టు ఉత్తర్వులు, డీప్‌ఫేక్ వీడియో కాల్స్ ద్వారా బెదిరించే ఏఐ ఆధారిత మోసాలు ఈ పాత చట్టం చట్రంలో ఇమడవు. ఐటీ చట్టంలోని సెక్షన్లు కేవలం సైబర్ స్పేస్‌లో జరిగే డేటా ఉల్లంఘనలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటాయి. కానీ, ఇక్కడ జరిగిన నేరం కేవలం డేటా ఉల్లంఘన కాదు. ఇది రాజ్యాంగ వ్యవస్థ హోదాను తప్పుగా సూచించడం. ఈ సంస్థాగత విశ్వాసాన్ని ధ్వంసం చేసే చర్యలను కేవలం వ్యక్తిగత మోసాలుగా కాక, వ్యవస్థల చట్టబద్ధతపై జరిగిన దాడిగా పరిగణించాలి. కఠినమైన చట్టపరమైన సవరణలు తక్షణమే రూపొందించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాక, మోసాలు జరిగినప్పుడు బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా, విధానాలను వెంటనే అమలు చేయాలి.

పౌరుల జాగ్రత్త ఎంతో అవసరం!

ఈ డిజిటల్ దాడికి శాశ్వత సమాధానం లభించాలంటే, అది ఉమ్మడి కృషి ద్వారానే సాధ్యం. ఈ నేరాలను అరికట్టడంలో ఎవరి బాధ్యత? అన్నది జవాబులేని ప్రశ్నగా మిగిలింది. ఈ సమస్యకు పరిష్కారం రాజ్యం, న్యాయ వ్యవస్థ, పౌరుడి ఉమ్మడి ప్రయత్నం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రభుత్వ యంత్రాంగం తక్షణ సహాయం కోసం 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను బలోపేతం చేయాలి. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాలపై అవగాహన ఉన్న కనీసం ఒక అధికారి ఉండేలా చూడాలి. సైబర్ ముఠాలపై నిఘా పెంచడానికి జాతీయ సైబర్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ ఏర్పాటును వేగవంతం చేయాలి. ఇక పౌరులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. వారికి కోర్టు/పోలీసు అధికారులమని చెప్పుకునే వ్యక్తులు డబ్బు అడిగినా, వాట్సాప్ కాల్స్‌లో అరెస్ట్ వారెంట్లు చూపించినా, అనుమానాస్పదంగా అనిపించినా వారు నిజమైన అధికారులు కారని నమ్మాలి. వ్యక్తిగత సమాచారం ఇవ్వకుండా, ప్రామాణికతను తక్షణమే ధృవీకరించుకోవాలి. ఈ అంశంపై సుప్రీంకోర్టు జోక్యం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకాలి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర సంస్థలు సమన్వయంతో పనిచేసి, సీబీఐ దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తేనే ఈ 'డిజిటల్ అరెస్ట్' భూతానికి అంతం పలకగలం. లేకపోతే, ఈ నేరగాళ్లు మన వ్యవస్థపై, ప్రజల విశ్వాసంపై నిరంతర దాడి చేస్తూనే ఉంటారు.

# హైదరాబాద్ శివార్లలో 199 అక్రమ స్టోన్ క్రషర్ యూనిట్లు!




హైదరాబాద్,నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల అమలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీజీ పోలీసు అకాడెమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ నిలిపివేయాలని ఎన్జీటీ ఆదేశించగానే వెంటనే ఆపివేసిన ప్రభుత్వం.. స్టోన్ క్రషర్ల మూలంగా పర్యావరణం దెబ్బతింటున్నదని, అనుమతిలేని వాటిపై తనిఖీలు నిర్వహించి మూసివేయాలని అదే ఎన్జీటీ ఆదేశిస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి లేని క్రషర్లను మూసివేస్తే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులకు నెలనెలా వచ్చే ఆమ్యామ్యాలు ఆగిపోతాయనే పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్క పటాన్ చెరు మండలం లక్డారంలోనే 42 స్టోన్ క్రషర్ యూనిట్లు నడుస్తున్నాయని సమాచారం. ఈ యూనిట్లు అన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందినవారివి, ఇందులో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూధన్ యూనిట్ కూడా ఉందని తెలుస్తున్నది. అందుకే క్రషర్లపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని పర్యావరణవేత్తలు ఆరోపిస్తున్నారు. గూడెం మహిపాల్ రెడ్డి సోదరుల ఇళ్లపై గతేడాది అక్రమ మైనింగ్ కేసులో ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసి రెండు రోజుల పాటు సోదాలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే.

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినా చర్యలు లేవు!

అక్రమ స్టోన్ క్రషర్ యూనిట్ల మూలంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా రోడ్లపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లు ధ్వంసం అవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసినా జిల్లా కలెక్టర్లు, మైనింగ్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్.. స్టోన్ క్రషర్ యూనిట్ల అక్రమ మైనింగ్ పై రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మూడు టీమ్ లను ఏర్పాటు చేసింది. ఈ మూడు టీమ్‌లు నగరంతో పాటు రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలో తనిఖీలు నిర్వహించాయి. నగరం చుట్టు పక్కల సుమారు 190 అనుమతి లేని స్టోన్ క్రషర్ యూనిట్లు ఉన్నాయని నివేదిక తయారు చేసి, గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

ఎమ్మెల్యే అండదండలు!

పటాన్ చెరు మండలం లక్డారంలో సుమారు 42 స్టోన్ క్రషర్ యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్లకు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అండదండలు ఉన్నాయనే ప్రచారం సాగుతున్నది. మొత్తం యూనిట్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులవేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటి మూలంగా తమ పంట పొలాలు నాశనమవుతున్నాయని పలువురు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందచేశారు. అధిక లోడు కారణంగా రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని, వాటిని పూడ్చివేయకుండా టిప్పర్లను తిప్పుతున్నారని తెలిపారు. పది చక్రాల టిప్పర్ పై 25 టన్నుల బరువు తీసుకువెళ్లాల్సి ఉండగా 35 టన్నులు తీసుకువెళుతున్నారని వారు అధికారులకు వివరించారు. అనుమతికి మించి తీసుకువెళ్తున్న వాహనాలను పోలీసులు, రవాణా, ట్రాఫిక్ పోలీసులు నిలిపివేయకుండా వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మైనింగ్ మూలంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, దుమ్ము, ధూళి కణాలతో శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నామని వాపోతున్నారు. పేలుళ్లతో తమ పంట పొలాలు బీడుబారిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా న్యాయం జరుగుతుందని భావిస్తున్నట్లు బాధితులు అధికారులకు విన్నవించారు.

లక్డారంలో టిప్పర్ల రాకపోకలు నిలిపివేత!

పటాన్ చెరు మండలం లక్డారంలో స్థానికులు మంగళవారం రోడ్డును పూర్తిగా తవ్వేసి టిప్పర్లు, లారీల రాకపోకలను నిలిపివేశారు. చేవెళ్ల మండలంలో జరిగిన బస్సు ప్రమాదానికి పటాన్ చెరు ప్రాంతానికి చెందిన టిప్పరే కారణమని స్థానికులు ఈ చర్యకు దిగారు. అధిక లోడుతో ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్తున్న టిప్పర్ల కారణంగానే మరణాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు గడిస్తున్న క్వారీ, క్రషర్ యజమానులు గ్రామాల రోడ్లను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. గుంతలు పడినా పూడ్చడం లేదని అన్నారు. అంతకు ముందు రోజు అనగా బస్సు ప్రమాదం జరిగిన వెంటనే లక్డారంలో స్టోన్ క్రషర్ యజమానులు తమ యూనిట్లను మూసివేసి పరార్ అయ్యారు. పోలీసులు, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు నిర్వహిస్తారనే భయంతో తాళాలు వేసుకుని వెళ్లిపోయారంటున్నారు.

గతంలో పటాన్ చెరు ఎమ్మెల్యే సోదరుడి అరెస్టు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అక్రమ మైనింగ్ మాఫియాను అణచివేయకుండా తన రాజకీయ మనుగడ కోసం బలాన్ని ఉపయోగిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని దారిలోకి తెచ్చుకునేందుకు ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డిని గతేడాది మార్చి నెలలో అరెస్టు చేయించిందనే వ్యాఖ్యలు అప్పట్లో వెలువడ్డాయి. అక్రమ మైనింగ్, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులో ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్స్ ను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆయనను పటాన్ చెరు పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో సంగారెడ్డి జైలుకు తరలించారు. అంతకు ముందు లక్డారంలో కుమారుడి పేరిట నడుస్తున్న క్వారీని కూడా సీజ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో మైనింగ్ చేయడంతో పాటు మైనింగ్ లీజ్ అగ్రిమెంట్ ముగిసినా రెన్యూవల్ చేయలేదని జిల్లా కలెక్టర్ కు స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీ నివేదించింది. కమిటీ నివేదిక ప్రకారం పటాన్ చెరు మండలంలోని లక్డారం,రుద్రారం,చిట్కుల్ గ్రామాల్లో ఐదు మైనింగ్ సంస్థలను సీజ్ చేయగా ఇందులో సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్స్ కూడా ఉంది.

ఈడీ కేసు నమోదు, రూ.300 కోట్ల అక్రమాలు : ఈడీ

లక్డారంలో అక్రమ మైనింగ్, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసు ఆధారంగానే ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. గతేడాది జూన్ నెలలో ఈడీ అధికారులు ఎమ్మెల్యే సోదరులతో పాటు నిజాంపేటలోని వారి బంధువుల ఇళ్లలో రెండు రోజుల పాటు సోదాలు నిర్వహించారు. సోదాల తరువాత ఈడీ ప్రకటన విడుదల చేసింది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరులు మైనింగ్ లో రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని తెలిపింది. ప్రభుత్వానికి రూ.39 కోట్ల నష్టం జరిగిందని వెల్లడించింది. ఇలా సంపాదించిన నగదును రియల్ ఎస్టేట్ కు మళ్లించారని, మరికొంత సొమ్మును బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు చేశారని పేర్కొంది. సోదాల్లో రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని, బినామీల పేర్ల మీద జరిగిన లావాదేవీలను పరిశీలిస్తున్నామని ఈడీ ప్రకటించింది.

# వైసిపి హయాంలో గంజాయి అడ్డాగా విశాఖ

విశాఖపట్నం, జగన్ హయాంలో విశాఖను డ్రగ్స్ అడ్డాగా మార్చారని వైసీపీపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో గంజాయి కంటైనర్, పెద్ద ఎత్తున గంజాయి దొరికేవన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతల అరాచకాలు ఆగడం లేదని... విశాఖలో వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండా రెడ్డి డ్రగ్స్‌తో పట్టుబడ్డారని అన్నారు. వైసీపీ యువజన విభాగం డ్రగ్స్ ముఠాగా మారిందని.. రెడ్ హ్యాండెడ్‌గా కొండా రెడ్డి దొరికారంటూ వ్యాఖ్యలు చేశారు. కొండారెడ్డి దొరకగానే వైసీపీ నేతలు ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు కొండారెడ్డిపై జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో గుడివాడ అమర్నాథ్ కూడా స్పందించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు రేవ్ పార్టీ చేసుకున్నట్లు సమాచారం వచ్చిందని... విచారణ జరిపిస్తామని అన్నారు. వైసీపీ నేతలు యువతకు డ్రగ్స్ సరఫరా చేసి.. రప్పా రప్పా రాజకీయాలు చేయాలని అనుకుంటారా అంట్యూ ÷ర్ అయ్యారు. డ్రగ్స్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని.. ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. విశాఖలో కానీ, ఎక్కడైనా సరే.. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిందంటే అంతా చంద్రబాబు కృషి వలనే అని అన్నారు. డేటాకి మైండ్ అప్లై చేస్తే... ఏఐ అని జగన్ అంటారా ? ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియట్లేదు అంటూ ఎద్దేవా చేశారు. మొదట గూగుల్ సెంటర్‌ను వైసీపీ నేతలు వ్యతిరేకించారని.. అందరూ ఉమ్మి వేస్తే ఇప్పుడు సమర్థిస్తున్నారని పట్టాభి వ్యాఖ్యలు చేశారు. పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు విశాఖకు వస్తున్నారని పట్టాభి అన్నారు. విశాఖలో 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను సమీక్షించామని తెలిపారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేయడానికి జీవీఎంసీ అద్భుతంగా పనిచేస్తోందని.. మేయర్ పీలా శ్రీనివాసరావును అభినందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని.. మూడు వేల మందికిపైగా ప్రతినిధులు వస్తారని చెప్పారు. పది లక్షల కోట్ల ఒప్పందాలు జరుగుతాయని.. ఏడున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సదస్సు ద్వారా జోరో వేస్ట్ కాన్సెప్ట్‌కు శ్రీకా రం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎక్కడా ఎ÷-లాస్టిక్ లేకుండా చూస్తున్నామని..క్లే బాటిల్స్‌ను ఉపయోగిస్తున్నామని కొమ్మారెడ్డి పట్టాభి వెల్లడించారు.

# సేమ్ టు సేమ్.. !

అమరావతి,అదేంటి అనుకుంటున్నారా? నిజమే. కొన్ని కొన్ని ఘటనలకు కార్యాకారణ సంబంధం ఉంటుంది. గతం లో దేశ ప్రధానిగా పనిచేసిన దేవెగౌడ గురించి పెద్ద ఎత్తున ఒక వాదన ప్రచారం జరిగింది. అది వాస్తవం కూడా. అయితే.. దానిని ఆయన సరిచేసుకునే ప్రయత్నం చేయలేకపోయారు. ఫలితంగా.. ఒక్కసారి ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు. తర్వాత.. అవకాశం తలుపు కాదు కదా.. వీధి వరకు కూడా రాలేదు. అచ్చంగా జగన్ పరిస్థితి కూడా ఇలానే ఉంటుందన్న జోరుగా సాగుతోంది.దేవెగౌడ విషయంలో ఏం జరిగిందో చూద్దాం.. కీలకమైన సమయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా బలం పుంజు కోని సమయంలో దేవెగౌడ ప్రధాని అయ్యారు. నిజానికి ఆ సమయంలో ఆయన పుంజుకుని ఉంటే.. ప్రజలతో మార్కులు వేయించుకుని ఉంటే.. ఇక, దేశంలో ప్రత్యామ్నాయ ప్రధాన మంత్రిగా ఆయనే ఉండేవారు. కానీ, ఆయన చేసిన నిర్లక్ష్యం.. వేదికలపైనే నిద్రపోవడం.. ప్రజలను పలకరించేందుకు కూడా.. సమయం ఉందుదయ్యా అంటూ.. వ్యాఖ్యానించడం మైనస్ చేశాయి.ఫలితంగా జేడీఎస్ నాయకులు(సొంత పార్టీ) సైతం దేవెగౌడను పక్కన పెట్టారు. అనంతర కాలంలో ఆయ న కుమారుడు కుమారస్వామి పగ్గాలు చేపట్టే పరిస్థితి వచ్చింది. దీనంతటికీ కారణం.. దేవెగౌడ అధికారం లో ఉన్నప్పుడు వ్యవహరించిన సంగతులే. ఎవరు ఎన్ని చెప్పినా.. ఆయన మారలేదు. బహిరంగ సభల నుంచి కేబినెట్ సమావేశాల వరకు ఆయన నిద్ర పోయారు. ఇవి బాగా ప్రచారంలోకి వచ్చి.. ఏకంగా ఆయనను పక్కన పెట్టే పరిస్థితి వచ్చేసింది.ఇక, జగన్ విషయానికి వస్తే.. అధికారంలో ఉన్నప్పుడు.. తర్వాత.. గత 16 మాసాలుగా కూడా.. ఆయన వ్యవహరిస్తున్న తీరు.. ఏమాత్రం సానుభూతికి నోచుకోవడం లేదు. విపత్తులు వచ్చినా.. విధ్వంసాలు జరిగినా.. బటన్ నొక్కుతున్నాగా? అనే మాటే వినిపించేది. నేరుగా జగన్ బాధితులను పరామర్శించిన ఘటన ఒక్క ఎల్జీ పాలిమర్స్ ఘటన సందర్భంలోనే. ఆ తర్వాత.. కరోనా వచ్చినా..ఏలూరులో కలుషిత నీరు.. ప్రబావం చూపించినా.. ఆయన ఎక్కడా బయటకు రాలేదు. ఇప్పుడు కూడా ఆయన తాడేపల్లికే పరిమితం అవుతున్నారు. హద్దులు దాటిన నాయకులపై అప్పట్లో చర్యలు కూడా తీసుకోలేదు. ఈ పరిణామాలను గమనిస్తే.. జగన్ పరిస్థితి కూడా దేవెగౌడ మాదిరిగానే ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

# పత్తి రైతులను వెంటనే ఆదుకోండి

అమరావతి,రాష్ట్రంలో పత్తి రైతుల సమస్యలపై కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి అచ్చెన్నాయుడు లేఖ రాశారు. మొంథా తుఫాను ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిందని, రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పత్తి అమ్ముకోవాల్సి వస్తోందని లేఖలో వెల్లడించారు. రాష్ట్రంలో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు, 8 లక్ష మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సీఎం ఏపీపీ, ఆధార్ ఆధారిత ।-పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్లు డిజిటల్ విధానంలో నిర్వహిస్తోందని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌ను రాష్ట్ర అనుసంధానం చేసిన తర్వాత సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో వివరించారు. రైతుల వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యేలా చేయాలని కోరారు. రైతులు సమీప జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి విక్రయించుకునేలా మ్యాపింగ్ చేయాలని అన్నారు. రైతులు దూరప్రాంతాలకు వెళ్లకుండా ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. గుంటూరులో ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని నియమించాలని కోరారు. వర్షానికి తడిసిన లేదా రంగు మారిన పత్తిని తగిన ధరకు కొనుగోలు చేయాలన్నారు. సహజ విపత్తుతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్రం తక్షణ సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు లేఖలో విజ్ఞప్తి చేశారు.

## నాకే ఈ పరిస్థితి ఎదురయితే..

న్యూఢిల్లీ,మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా సీన్‌బామ్ నడిరోడ్డుపై లైంగిక వేధింపులకు గురైన విషయం తెలిసిందే. మిచొకాన్‌లో ప్రజలతో మాట్లాడుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి బహిరంగంగా తాకుతూ ఆమెను ముద్దుపెట్టుకోవడానికి ప్రయత్నించాడు. దేశ అధ్యక్షురాలు నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. ఈ ఘటనపై క్లాడియా తాజాగా స్పందించారు. ఈ మేరకు తనపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు పెట్టారు. ఈ ఘటన మెక్సికోలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులను ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. 'పురుషాధిక్యత, లైంగిక వేధింపులతో దేశంలోని మహిళలు ఇప్పటికీ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈరోజు దేశ అధ్యక్షురాలైన నాకే ఇలా జరిగితే.. మన దేశంలోని యువతుల పరిస్థితి ఏంటి..?

# ఉపఎన్నికల వేళ మాగంటి కుటుంబంలో చిచ్చు..



హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేళ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు సొంత కుటుంబం నుంచి ఊహించని షాక్ తగిలింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వారసత్వం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం చుట్టూ నడుస్తున్న వివాదం ముదిరింది. ఆ పంచాయితీ శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంకు చేరింది. తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు ఫిర్యాదుదారులు మాలని దేవి, ఆమె కుమారుడు ప్రద్యుమ్న తారక్‌తోపాటు.. మాగంటి గోపీనాథ్ తల్లి మహానందకుమారి కూడా హాజరయ్యారు. మాగంటి సునీత తరపున ఆమె చిన్న కుమార్తె దీశిరా, వారి తరపు లాయర్ విచారణకు హాజరయ్యారు. ఇరుపక్షాల నుంచి తహసీల్దార్ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

అసలేం జరిగిందంటే..?

గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు రెవెన్యూ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడంపై మొదటి భార్య మాలినీదేవి అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే ఆమె కుమారుడు ప్రద్యుమ్న తారక్ సైతం ఇది వరకే జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఇదివరకే మాగంటి గోపీనాథ్ తల్లి, ఆయన ఇద్దరు కూతుళ్లు, కుమారుడు తహసీల్దార్ ఎదుట హాజరవ్వగా.. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ జారీపై గురువారం మాగంటి గోపీనాథ్ రెండో భార్య మాలినీదేవి, ఆమె కుమారుడు తారక్ ప్రద్యుమ్న, మాగంటి తల్లి మరోసారి శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి ఎదుట ఇరుపక్షాల వాదనలు వినిపించారు. అనంతరం ఈ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇష్యూకు సంబంధించిన కేసును ఈనెల 25 వరకు వాయిదా వేశారు. మాగంటి సునీత తరపున న్యాయవాది లలిత రెడ్డి మాట్లాడుతూ.. గోపీనాథ్ మృతి తరువాత ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ మాగంటి సునీత, వారి పిల్లలు తీసుకున్నారు. దానిపై కొందరు ఫిర్యాదు చేయడంతో ఈ వివాదం నడుస్తుందని అన్నారు. అసెంబ్లీ సెక్రటరీ జారీ చేసిన స్పౌస్ కార్డులో కూడా మాగంటి సునీత పేరు మాత్రమే ఉందని అన్నారు. మాగంటి గోపీనాథ్ అన్ని డాక్యుమెంట్లలో, పాలసీ డాక్యుమెంట్లలో నామిని భార్యగా సునీత, పిల్లలుగా అక్షర, దిశర, వాత్సల్య పేర్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. మాగంటి గోపీనాథ్ తల్లి మహానందకుమారి మాట్లాడుతూ సంచలన కామెంట్స్ చేశారు. మాగంటి గోపీనాథ్ మొదటి భార్య మాలిని దేవి. వారికి నేనే పెండ్లి చేశానని చెప్పారు. వారికి విడాకులు కాలేదని తెలిపారు. సునీతతో మాగంటి గోపీనాథ్‌కు నేను వివాహం చేయలేదని చెప్పారు. మాగంటి మొదటి భార్య కుమారుడు ప్రద్యుమ్న తారక్ మాట్లాడుతూ.. మా నాన్న చనిపోయిన సమయంలో అంత్యక్రియలకు రాకుండా ఓ పార్టీ నాయకులు అడ్డుకున్నారని, మమ్మల్ని బెదిరింపులకు గురిచేశారని ఆరోపణలు చేశారు. మాగంటి గోపీనాథ్ చనిపోకముందు తనతో మాట్లాడేవారని.. వాయిస్ మెస్సేజ్ లు, వాయిస్ మెయిల్స్, ఆడియోలు కూడా ఉన్నాయని చెప్పారు. ఇది కేవలం ఫ్యామిలీ విషయం.. ఇందులో రాజకీయాలకు ఎలాంటి ప్రమేయం లేదని ప్రద్యుమ్న చెప్పుకొచ్చారు.

# రేవంత్ కి ఏమైంది....లాజిక్ మిస్ ?

హైదరాబాద్,తెలంగాణా ముఖ్యమంత్రి డైనమిక్ లీడర్ గా పేరు తెచ్చుకున్న రేవంత్ రెడ్డికి ఏమైంది అని ఒక చర్చ సాగుతోంది. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఆయన చేస్తున్న ప్రసంగాలు కానీ ప్రత్యర్థుల మీద ఆయన చేస్తున్న విమర్శలు కానీ ఆవేశాన్ని ఎందుకో బయటపెడుతున్నాయి. విమర్శలు చేసినా లేక తన వాదనను బలంగా వినిపించాలన్నా తర్కం అన్నది ఒకటి ఉంటుంది. రేవంత్ రెడ్డి అయితే తర్కానికి దూరంగా ఎపుడూ స్టేట్మెంట్స్ ఇచ్చిన దాఖలాలు లేవు, అలాగే ఆవేశంతో ఆయన ప్రసంగాలు చేస్తారు కానీ పరిమితులు కూడా ఉంటాయి. కానీ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక మాత్రం ఎందుకో రేవంత్ రెడ్డి విషయం మీద ఒక చర్చకు తావిస్తోంది. ఎందుకు ఏమిటి అన్న మాటలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి.

కాంగ్రెస్ అంటేనే ముస్లిం :

ఇదేమి స్టేట్మెంట్ అన్నది అంతా అంటున్న మాట. ఆయన ఒక సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే ముస్లిం అన్నారు, అంతటితో ఆగకుండా ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని కూడా అన్నారు. రైమింగ్ బాగున్నా టైమింగ్ లాజిక్ ఈ స్టేట్మెంట్ కి ఎంత మేరకు ఉంది అన్నదే ఇపుడు అంతా ఆలోచిస్తున్నది. నిజానికి ఇది అర్థం లేని ప్రకటన అలాగే అర్థం లేని వాదనగానే అంతా చూస్తున్నారు. ఈ రకంగా ప్రకటనలు ఇవ్వడం వల్లనే బీజేపీకి భారీగా పొలిటికల్ స్కోప్ ఇచ్చేందుకు అవకాశం ఉంటోంది అని కూడా అంటున్నారు.

సెక్యూలర్ కి అర్థం :

ఇదే సభలో రేవంత్ మరో మాట అన్నారు. తాను మొదటి నుంచి సెక్యులర్ అని. మరి సెక్యులర్ అంటే అన్ని మతాలను ఒక్కలా సమానంగా చూడడం కదా అని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ అంటే ముస్లిం అని ఒక మతం గురించి అంత బాహాటంగా చెబుతూ మాట్లాడితే సెక్యులర్ కి అర్థం ఏమి ఉంటుంది అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఎన్నికల్లో ఇలాంటివి అంతా అంటూ ఉంటారు, వింటూ ఉంటారు, కానీ అవి హద్దులు దాటితేనే రాజకీయంగానే కాదు శతాధిక చరిత్ర కలిగిన పార్టీకి కూడా ఇబ్బందులు వస్తాయని గుర్తు చేస్తున్నాయి. కాంగ్రెస్ అంటే కుల మత వర్గ వర్ణ భేదం లేకుండా అందరినీ అక్కున చేర్చుకునే రాజకీయ పార్టీ అని సీఎం హోదాలో చెబితే ఎంత బాగుండది అని అంటున్నారు.

బీజేపీకే ప్లస్ :

ఎలా అంటే ఇప్పటికే దేశంలో చూసుకుంటే బీజేపీ మెజారిటీ వర్గం అంటూ హిందూ ఓట్లను కన్సాలిడేట్ చేస్తూ వస్తోంది. అది దేశంలో అనేక ఎన్నికల్లో బయటపడుతోంది. గతానికి భిన్నమైన వాతావరణం ఇది. ఇపుడు తెలంగాణాలో



ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ నేపధ్యంలో వారి ఆలోచనలు వారి వ్యూహాలు ఎపుడూ పదునుగా ఉంటాయి. అటువంటి నేపధ్యంలో వారికి అవకాశాలు ఇచ్చేలా ఈ విధంగా ప్రకటనలు ఇస్తే సహజంగానే మరో వర్గాన్ని బీజేపీ బాగా దగ్గరకు తీస్తుంది. వారి మదిలో కూడా కొత్త ఆలోచనలు పుట్టేలా ఈ ప్రకటనలు ఉంటాయి అని అంటున్నారు.

బూమరాంగ్ అవుతాయి :

ఎన్నికల్లో ఎన్నో చెబుతూ ఉంటారు, ఓట్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా నాయకులు కానీ పార్టీలు కానీ ప్రకటనలు ఇవ్వడం కానీ విమర్శలు చేయడం కానీ జరుగుతూ ఉంటుంది. అయితే కీలకమైన స్థానాల్లో ఉన్న వారు ఇచ్చే ప్రకటనలకు ఒక విలువ ఉంటుంది. వారు ఏ మాత్రం తడబడినా కూడా ఏకంగా ఆయా పార్టీలకే ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు. అందుకే ఇపుడు రేవంత్ రెడ్డి స్టేట్మెంట్ మీద భిన్నంగా స్పందన వస్తోంది. నిజానికి ఫలానా వర్గానికి తాము ఎంతో చేశామని చెప్పడంలో తప్పు లేదు, కానీ వారే పార్టీ వారితోనే మేము అన్నట్లుగా ఇచ్చే ప్రకటనల వల్ల లాభం లేకపోగా బూమరాంగ్ అవుతుందని అంటున్నారు. రాజకీయంగా వ్యూహాలతో పాటు ఎక్కడ ఎపుడు ఎలా మాట్లాడాలో తెలిసిన రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల వేళ మాత్రం ఎందుకో తడబడుతున్నారని పొరబడుతున్నారని వ్యాఖ్యానాలు అయితే వినిపిస్తున్నాయి. సరే ఇంతలా ఒక వర్గాన్ని సొంతం చేసుకుని ఆయన ఇచ్చిన ఆ స్టేట్మెంట్ వల్ల ఫలితం సానుకూలం అయితే ఫరవాలేదు, కానీ ఏ మాత్రం రివర్స్ అయితే మాత్రం అపుడు దాని ప్రభావం ఏమిటి దాని మూల్యం ఎంత అన్నది తెలుస్తుంది అని అంటున్నారు.

# రైతులకు కన్నీటి గాయాలు.. తడిసి ముద్దవుతోన్న పంటలు!

హైదరాబాద్,రైతులను క‘న్నీటి’ గాయాలు వెంటాడుతున్నాయి. ఈ సీజన్ మొత్తం రైతులతో వానలు చెలగాటమాడుతున్నాయి. పూత, కాత దశలో కురిసిన వర్షాలతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం కనబరిచాయి. పత్తి పంట రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నది. వరి పంట పొట్ట దశలో ఒకసారి, కోత దశలో మరోసారి, పంట కోసిన తర్వాత విక్రయించే దశలో పడరాని పాట్లుపడుతున్నారు. మొక్కజొన్న పరిస్థితి కూడా ఇదే స్థితిలో ఉంది. ఇప్పటికే పలుమార్లు తడిసిన పంట ఉత్పత్తులను పదేపదే ఆరబోసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అయితే, ఆరబోసుకునేందుకు రైతులు పడుతున్న అగచాట్లు అన్నీఇన్నీకావు. ఒక్కో రైతుది ఒక్కో పరిస్థితి. కదిలిస్తే కన్నీటి గాథలు కల్లల్లోంచి ఉబికి వస్తున్నాయి. ఆఖరికి అమ్ముకునేందుకు మార్కెట్ కు తెచ్చిన తర్వాత కూడా ఆగమాగమవుతున్నారు. మొన్ననే మొంథా తుఫాన్ దెబ్బకు తల్లడిల్లి డీలాపడిన రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండుగా.. సోమ, మంగళవారాల్లో కురిసిన అకాల వర్షాలతో కోలుకోలేని పరిస్థితి తలెత్తింది. వరంగల్, కరీంనగర్, హుజురాబాద్, నల్లగొండతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో తేమ పేరుతో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులకు శాపంగా మారుతోంది. ఒక్కో రైతు ధాన్యం, మక్కలు ఇప్పటికే రెండు మూడు పర్యాయాల తడిసిపోవడం, ఆరబెట్టడం, మళ్ళీ అకాల వర్షాలబారిన పడి తడిసిపోవడంతో రైతుల్లో అసహనం నెలకొంటోంది. ఇంటికి తీసుకపోలేక, ఇతరులకు అమ్మలేక నానాయాతనకు గురవుతున్నారు.

వానపాలైతున్న పంట ఉత్పత్తులు

తడిసిన మొక్కజొన్న, ధాన్యం ఆరబోసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరగానే అమ్ముకునేందుకు అవకాశం ఉంటోందని ధాన్యం,



మక్కల కొనుగోలు కేంద్రాల్లో కొందరురైతులు, మార్కెట్లలో మరికొందరు ఆరబోస్తున్నారు. విక్రయానికి ముందు ఇళ్ల వద్ద స్థలం లేని రైతులు రోడ్లపై, చెరువు కట్టలపై ఆరబోస్తున్నారు. ఆకస్మికంగా వర్షాలు కురిసినపుడు టార్పారిన్లు తదితర వాటితో పంట రక్షణకు ప్రయత్నిస్తున్నప్పటికీ కింది నుంచి వర్షం నీటి ప్రవాహం పెరిగి ధాన్యం, మక్కలు నీటిపాలవుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు కండ్ల ముందే కాల్వల్లో కలిసిపోతుంటే కంటనీరు పెట్టడం తప్ప రైతులు ఏమీ చేయలేని దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నీట కలుస్తున్న పంట ఉత్పత్తులను చూసి రైతులు లబోదిబో మంటున్నారు. విక్రయించేందుకు మార్కెట్కు తెచ్చిన పత్తి కూడా అకాల వర్షాలతో తడిసిపోవడంతో రైతుల పరిస్థితి ఎంత అధ్యాన్నంగా మారిందో తెలుస్తోంది. వరంగల్ మార్కెట్లో మంగళవారం పత్తి, మక్కలు తడిసి రైతులు ఇబ్బందులపాలయ్యారు. ఇప్పటికైనా రైతుల పరిస్థితిని గుర్తించి సకాలంలో పంట ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# రాహుల్ బాంబులు ఎందుకు పేలడం లేదు ?



న్యూఢిల్లీ,దేశ ప్రధాన ప్రతిపక్ష నేత బాంబులేస్తున్నారు. చాలా రోజులుగా ఆయన ఇదిగో హైడ్రోజన్ బాంబు .. అదిగో నైట్రోజన్ బాంబు అని చెబుతూనే ఉన్నారు. ఆ బాంబులు ప్రకటించగానే అల్లకల్లోలం రేగుతుందని చెబుతూ ఉంటారు. కానీ ఆయన ఇప్పటి వరకూ మూడు ప్రెస్ మీట్లు పెట్టి మూడు భయంకరమైన బాంబులు ప్రయోగించారు. భయంకరమైన నిజాలతో కూడిన బాంబులు అని ఆయన అనుకున్నారు. ఇతరులెవరు అనుకోలేదు. అనుకోవాల్సిన జనం అనుకోలేదు. అక్కడే సమస్య వస్తోంది. రాహుల్ గాంధీ ప్రకటించిన ఓట్ల చోరీ నెరేటివ్‌ను ఎవరూ నమ్మడం లేదు. అందుకే స్పందన ఉండటం లేదు. కానీ కాంగ్రెస్ లేదా రాహుల్ గాంధీ ఈ విషయాన్ని పట్టించుకోకుండా..తమ దారిన తాము రాజకీయాలు చేస్తున్నారు.

హర్యానా హైడ్రోజన్ బాంబు కనీసం సౌండ్ చేయలేదేం ?

హెచ్ ఫైల్స్ పేరుతో రాహుల్ గాంధీ ప్రకటించిన హర్యానా పాతిక లక్షల ఓట్ల చోరీ కథ కామెడీగా ముగిసిపోయింది. ఆయన చాలా బండిల్స్ ఓ ట్రాలీ మీద పెట్టుకొచ్చి ఇవే ఆ పాతిక లక్షల దొంగ ఓట్లు అని ప్రకటించారు. అన్ని వివరాలు చెప్పి.. ఓ బ్రెజిల్ మోడల్ ఇరవై రెండు సార్లు ఓట్లు వేసిందన్నారు. అక్కడే ఆయన ఎంత సీరియస్ గా ఓట్ల చోరీ మీద కసరత్తు చేశారో అర్థం అయిపోతుంది. దొంగ ఓట్లు వేయించడానికి ఎవరైనా బ్రెజిల్ మోడల్ ను మాట్లాడుకుంటారా అది కూడా ఆమె బూతులు తిరిగి తిరిగి ఇరవై రెండు ఓట్లు వేస్తారా?. నిజంగా అలాంటి దొంగ ఓట్లు వేసే అవకాశం ఉంటే .. ప్రొఫెషనల్స్ మన దేశంలో లక్షల మంది ఉంటారు. అంత మాత్రం దానికి బ్రెజిల్ నుంచి తెచ్చుకుంటారా?. ఈ చిన్న లాజిక్ రాహుల్ మిస్సయ్యారు..కానీ జనం మిస్ కాలేదు.

ఇప్పటికి మూడు సార్లు బాంబులేశారు.. ఎఫెక్ట్ ఎంతో సమీక్ష చేసుకున్నారా?

రాహుల్ గాంధీ రాజకీయాన్ని రాజకీయంగా చేయడం లేదు. ఆయన బీజేపీపై పోరాడాల్సిందిపోయి.. ఎన్నికల సంఘం మీద పోరాడుతున్నారు. అదే రాంగ్ ట్రాక్. మొదట్లో ఈవీఎంలపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు ఓట్ల చోరీ అంటున్నారు. మన దేశంలో ఓటర్ జాబితా అనేది పబ్లిక్ డాక్యుమెంట్. రాజకీయ పార్టీలన్నింటికీ ఎన్నికల సంఘం ఇస్తుంది. ఎవరి ఓటు లేకపోయినా వెంటనే తెలిసిపోతుంది. అందుకే ఓట్ల గల్లంతు అనే మాట ఎన్నికలు జరిగితే పెద్దగా వినిపించడం లేదు. దొంగ ఓట్లు అనే మాట కూడా లేదు. ఎందుకంటే.. ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా పెరిగిపోయింది. దొంగ ఓటర్లు వేస్తే సులువుగా పట్టేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఏపీలో జరిగిన ఎన్నికల్లో దొంగ ఓటర్లను మీడియానే పట్టుకుంది. అందుకే రాహుల్ గాంధీ చేస్తున్న పరిశోధనా ఫలితాల ప్రకటనలు ఏ మాత్రం ఎఫెక్ట్ చూపించడం లేదు.

ఓడిపోయాక ఎన్ని మాటలు చెప్పినా వృథా రాహుల్‌కు ఎవరూ చెప్పరా?

రాహుల్ గాంధీ తమ ఓటములకు ఎన్నికల సంఘాన్ని బాధ్యుల్ని చేయాలనుకుంటున్నారు. ప్రజలు తమను గెలిపిస్తున్నారని కానీ ఈసీ మాత్రం గెలవనీయడం లేదని ప్రజల్లో అభిప్రాయం కల్పించాలనుకుంటున్నారు. అలా కల్పించి యువత, జెన్ జెడ్ తరాన్ని రోడ్ల మీదకు తీసుకు వచ్చి..అల్లకల్లోలం సృష్టించాలనుకుంటున్నారు. అలా సృష్టిస్తే తనకు అధికారం వస్తుందని అనుకుంటున్నారు. కానీ భారత ప్రజాస్వామ్య బలాన్ని నెహ్రూ వారసుడు సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. ఆయన ప్రజా మద్దతు కూడగట్టాలంటే.. ఇంకా విశాలంగా ఆలోచించాల్సి ఉంది. ఆ స్థాయి వచ్చినప్పుడే ఆయన మరింత తెలివైన నేతగా గుర్తింపు పొందుతారు.

# చంద్రబాబులో అంత కాన్ఫిడెన్స్‌కి కారణమేంటి..



అమరావతి, వస్తామ్. మళ్లీ మళ్లీ పవర్‌లోకి వస్తాం. అసలు టీడీపీ ఓడిపోదు. రాసి పెట్టుకోండి. గెలుపు మనదే. ప్రభుత్వంలో ఉండేది కూడా టీడీపీనే. ఇది సీఎం చంద్రబాబు పార్టీ సీనియర్ నేతలతో చెబుతున్న మాట ఇది. పవర్‌పై బాబు ధీమా వెనుక ప్లానేంటి? రాబోయే ఎన్నికలకు..ఫ్యూచర్ పాలిటిక్స్‌కు చంద్రబాబు దగ్గర ఉన్న అస్త్రాలేంటి? అంత గట్టిగా ఓడిపోబోమని చెప్పడానికి కారణమేంటి?ఏపీలో పవర్ షిఫ్టింగ్ సిస్టమ్ నడుస్తోంది. విభజన తర్వాత ఒకసారి టీడీపీ అధికారంలోకి వస్తే నెక్స్ట్ టైమ్ జగన్ పవర్‌లోకి వచ్చారు. తర్వాత మొన్నటి ఎన్నికల్లో కూటమి ల్యాండ్ స్లైడ్ విక్టరీతో ఏపీని పాలిస్తోంది. రాబోయే ఎన్నికల కోసం ఇటు కూటమి..అటు వైసీపీ ఎవరి అస్త్రాలు వాళ్లు రెడీ చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే విపక్షంలో ఉన్న వైసీపీ 2029లో అధికారం తమదేనని ధీమాగా ఉంది. సీఎం చంద్రబాబు మాత్రం టీడీపీ ఎప్పటికీ ఓడదంతే అంటున్నారు.

చంద్రబాబు మాటల్లో ఏదో పెద్ద ప్లానే ఉందన్న టాక్..

చంద్రబాబు నోట ఆ మాట వచ్చిందంటే ఆశామాషీ కాదు. ఎందుకంటే గ్రౌండ్ లెవల్ పరిస్థితులకు భిన్నంగా బాబు ఎప్పుడూ మాట్లాడరు. పార్టీ ఇంటర్నల్ మీటింగ్స్‌లో నెగెటివ్ అంశాల మీదే ఎక్కువ డిస్కస్ చేస్తారు. అలాంటిది టీడీపీకి ఓటమే ఉండదన్నట్లుగా బాబు..పార్టీ నాయకులతో చెప్పడం చూస్తుంటే ఏదో పెద్ద ప్లానే ఉందన్న టాక్ వినిపిస్తోంది. టీడీపీ ఓడిపోదు..ఇక నుంచి వచ్చే జరిగే ప్రతీ ఎన్నికలోనూ గెలిచి తీరుతుందని అన్నారట చంద్రబాబు. ఒకటి రెండు సార్లు కాదు అనేక సార్లు టీడీపీ గెలిచేలా చూస్తున్నామని చెప్పారు. ఒకే పార్టీ అధికారంలో ఉంటేనే ఏపీ అభివృద్ధి సాధ్యమని..ప్రజలు కూడా అలానే స్పందించేలా పార్టీ సమాయత్తం అవుతోందని బాబు చెప్పుకొస్తున్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక..చంద్రబాబు ప్లానింగ్..అడ్మినిస్ట్రేషన్ అంతా మారిపోయింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల నుంచే ఎమ్మెల్యేల పనితీరు మీద ఆరా తీయడం మొదలు పెట్టారు. ప్రభుత్వం మీద ఎక్కడా నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమస్యలు..ఇచ్చి హామీలు ఇలా అన్నింటిని పూర్తిగా అవగాహన చేసుకున్న బాబు 2024 ఎన్నికల తర్వాత మాత్రం వైసీపీకి ఏ మాత్రం చాన్స్ ఇవ్వకుండానే వ్యూహాలు అమలు చేస్తున్నారు. అటు పాలన, ఇటు పార్టీ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ వస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా మెయింటెన్ చేస్తున్నారు.

కీలక స్కీమ్స్ అన్నీ ఒక్కొక్కటిగా అమలు..

బాబు అంటే అభివృద్ధి మంత్రమేనని.. సంక్షేమ పథకాలు, పేదలకు ఉచితాలు ఇవ్వరంటూ ఉన్న ప్రచారానికి చెక్ పెట్టి..సంక్షేమానికి టాప్ ప్రయారిటీ ఇస్తున్నారు. అన్నదాత సుఖీభవ, పెన్షన్లు, తల్లికి వందనం, వాహనమిత్ర ఇలా కీలక స్కీమ్స్ అన్నీ ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ..కూటమి పట్టు సడలకుండా ముందుకెళ్తున్నారు. రాబోయే ఎన్నికల్లోనే కాదు మరో 15ఏళ్ల పాటు కూటమిగానే ఉంటామని చెబుతున్నారు. అంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసే ఉంటాయనేది చంద్రబాబు, పవన్ చెబుతున్న మాట. మరోవైపు వైసీపీ ఇంకా దూకుడు పెంచినట్లుగా కనిపించట్లేదన్న టాక్ వినిపిస్తోంది. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీ లీడర్లతో పాటు జగన్ కూడా పెద్దగా జనాల్లోకి రావడం లేదన్న చర్చ ఉంది. పైగా విపక్షంలో వైసీపీ ఒంటరిగా ఉంది. 2024లో కూటమి దాదాపుగా 60శాతం ఓటు షేర్‌ను రాబట్టింది. ఇందులో ఏ కొంత తగ్గినా కొన్ని సీట్లు తగ్గుతాయే తప్ప అధికారం కోల్పోయేంత సీన్ ఉండదని లెక్కలు వేసుకుంటున్నారట చంద్రబాబు. గెలుపు మీద ధీమాగా ఉంటూనే వైసీపీని ఎక్కడా లైట్ తీసుకోవడం లేదు చంద్రబాబు. సమయం, సందర్భం దొరికిన ప్రతీసారి..మీటింగ్ ఏదైనా డయాస్ మరేదైనా జగన్‌ను, వైసీపీ పాలనను కార్నర్ చేస్తూనే ఉన్నారు. సేమ్‌టైమ్ అక్రమాలు, అవినీతి చేశారంటూ వైసీపీ లీడర్లకు ఒకరి తర్వాత మరొకరికి ఉచ్చు బిగిస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ లీడర్లంతా గప్ చుప్ అయిపోయి..మీడియా ముందుకు రావడానికి కూడా ఆలోచిస్తున్నారట. ఇక రాజకీయంగా వైసీపీ 2019కు ముందున్నంత పటిష్టంగా ఉందా లేదా? ఏ నియోజకవర్గంలో ఫ్యాన్ పార్టీ స్ట్రాంగ్‌గా ఉంది? అందుకు విరుగుడు ఏంటి? అంటూ ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ నడిపిస్తున్నారట చంద్రబాబు. జగన్ పాలనను జనాలు ఒకసారి చూసారు కాబట్టి ఆ పార్టీకి ప్రజల నుంచి అంత ఆదరణ దక్కకపోవచ్చన్న లెక్కల్లో ఉందట కూటమి. ఇలా తనదైన మంత్రాంగంతో..ఏపీ పొలిటికల్ గేమ్‌లో బాబు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకునే టీడీపీదే విజయం అన్నట్లుగా బాబు చెప్పినట్లు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. బాబు ధీమానే నిజం కాబోతోందా? ఫ్యూచర్ పాలిటిక్స్ ఎప్పుడు ఎటు వైపు తిరుగుతాయో చూడాలి.

# మద్యం ప్రియులకు బిగ్ షాక్.. 4 రోజులు వైన్ షాపులు బంద్..

హైదరాబాద్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికల నేపథ్యంలో.. పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు కాపాడటం, అక్రమ మద్యం సరఫరా జరగకుండా చూడటమే లక్ష్యంగా మొత్తం నాలుగు రోజుల పాటు వైన్ షాపులు, బార్లు, పబ్బులు, రెస్టారెంట్లలో మద్యం విక్రయాన్ని నిషేధించారు. ఈ ఆదేశాలు నియోజకవర్గ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలకు వర్తించనున్నాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 9న సాయంత్రం 6 గంటల నుండి నవంబర్ 11న సాయంత్రం 6 గంటల వరకు మద్యం విక్రయం పూర్తిగా నిషేధం. అదనంగా, నవంబర్ 14న కౌంటింగ్ రోజు కూడా ఇదే ఆంక్షలు కొనసాగనున్నాయి. అంటే, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వైన్ షాపులు, బార్లు మూసేలా ఆదేశాలు జారీ చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా మద్యం పంపిణీ ద్వారా.. ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలను అరికట్టడమే లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే మద్యం దుకాణాల లైసెన్సులను రద్దు చేసే అవకాశముందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి కౌంటింగ్ ముగిసే వరకు మద్యం విక్రయం నిషేధం ఉంటుంది. ప్రజలంతా ఈ ఆంక్షలను సహకరించాలని కోరుతున్నాం అని పేర్కొన్నారు. వైన్ షాపులతో పాటు మద్యం విక్రయించే హోటళ్లు, పబ్బులు, రెస్టారెంట్లలో కూడా ఈ నిషేధం అమల్లో ఉంటుంది. లైసెన్స్ కలిగిన ప్రైవేట్ క్లబ్బులు కానీ స్టార్ హోటల్లో కూడా మినహాయింపులో లేవని స్పష్టంచేశారు. ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం రవాణా జరగకుండా.. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు జిల్లాల నుంచి మద్యం తరలించే ప్రయత్నాలు జరుగుతాయని సమాచారం అందడంతో అన్ని ఎంట్రీ పాయింట్లలో పోలీసులు, ఎక్సైజ్




అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నవంబర్ 11న జరగనుంది. అన్ని రాజకీయ పార్టీలూ చివరి దశ ప్రచారంలో బిజీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ ప్రాంతాల్లో శాంతి భద్రతల కోసం పోలీసులు భారీగా బలగాలను మోహరించారు.

## ప్రాణం తీసిన బీడీ...

నిర్మల్,ఓ వృద్ధుడి ప్రాణాలను బీడీ బలి తీసుకుంది. మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఈ దారుణ ఘటన నిర్మల్ జిల్లాలోని దండేపల్లి మండ పరిధిలోని తళ్లపేట గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తళ్లపేట గ్రామానికి చెందిన నాగయ్య(55) తన భార్య, కుమారుడు, కోడలితో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే బుధవారం రాత్రి తన గదిలో నాగయ్య ఒంటరిగా నిద్రించాడు. బీడీ తాగే అలవాటు ఉండడంతో.. అర్ధరాత్రి వేళ వెలిగించాడు. దాన్ని ఆర్పేయకుండానే నిద్రలోకి జారుకున్నాడు. మంటలు మంచానికి అంటుకున్నాయి. దీంతో క్షణాల్లోనే బెడ్‌షీట్లకు మంటలు వ్యాపించి, నాగయ్య సజీవ దహనమయ్యాడు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com